ప్రజాశక్తి
సోమవారం 23 డిసెంబర్ 2024
8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

ఉద్యమ స్ఫూర్తితో ముందుకు..

◆ నినదించిన సిపిఎం అనకాపల్లి జిల్లా మహాసభ ◆ పార్టీ శ్రేణుల్లో సమరోత్సాహం
◆ జిల్లా సమగ్రాభివృద్ధి, స్థానిక సమస్యలపై పోరాటాలకు నేతల పిలుపు

సభలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, నర్సీపట్నం టౌన్ విలేకరి

సిపిఎం అనకాపల్లి జిల్లా 24వ మహాసభ ఆదివారం సమరోత్సాహంతో ముగిసింది. రెండు రోజులపాటు నర్సీపట్నంలో జరిగిన ఈ మహాసభలో జిల్లాలోని కీలక సమస్యలపైనా, ప్రభుత్వ ప్రజా, కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలపైనా చర్చించారు. జాతీయ, రాష్ట్ర పరిస్థితులను నాయకులు మహాసభ వేదికగా వివరించారు. జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్థానిక సమస్యలపై నిరంతర ఉద్యమాలు చేపట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. జిల్లా మహాసభ 22 తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించింది. కార్యకర్తలకు దిశానిర్దేశం చేసింది.

శనివారం ర్యాలీ, బహిరంగ సభతో ప్రారంభమైన ఈ మహాసభ ఆద్యంతం ఉత్తేజభరితంగా సాగింది. ఆదివారం ఉదయం పార్టీ జెండాను సీనియర్ నాయకులు త్రిమూర్తులు రెడ్డి అవిష్కరించారు. అమరవీరుల స్థూపం వద్ద పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, కిల్లో సురేంద్ర, జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, తదితరులు పూలు వేసి నివాళులర్పించారు. ఎ.బాలకృష్ణ నగర్, సత్తిబాబు ప్రాంగణం, మిగతా 2లో..

కార్యదర్శి కోటేశ్వరరావు

లోకనాథం

అప్పలరాజు

21 మందితో జిల్లా కమిటీ ఎన్నిక

21 మందితో సిపిఎం అనకాపల్లి జిల్లా కమిటీ ఎన్నికైంది. జిల్లా కార్యదర్శిగా జి.కోటేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులుగా కె.లోకనాథం, ఎం.అప్పలరాజు, డి.వెంకన్న, ఆర్.శంకరరావు, గనిశెట్టి సత్యనారాయణ, జి.శ్రీరామ్, జిల్లా కమిటీ సభ్యులుగా బి.ప్రభావతి, ఆర్.రాము, కె.గోవిందరావు, వివి.శ్రీనివాసరావు, జి.దేముడు నాయుడు, అడిగర్ల రాజు, అల్లు రాజు, ఎం.రాజేష్, బిటి.దొర, ఎం.సత్యన్నారాయణ, డిడి.వరలక్ష్మి, గూనూరు వరలక్ష్మి, ఇ.నరసింహమూర్తి, బి.ఉమామహేశ్వరరావు ఎన్నికయ్యారు.

వెంకన్న

శంకరరావు

సత్యనారాయణ

శ్రీరామ్

రైల్వే స్టేషన్‌లో తప్పిన ప్రమాదం

- విద్యుత్ తీగలను ఈడ్చుకెళ్లిన ఇంజిన్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో ఆదివారం ప్రయాణికులకు పెను ప్రమాదం తప్పింది. కొంతమంది ప్రయాణికుల కథనం మేరకు.. ఆదివారం తెల్లవారుజామున ఆరు గంటల సమయంలో మూడో నెంబర్ ఫ్లాట్ ఫారానికి చేరుకున్న 22606 పురులియ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు ఇంజిన్ మారుస్తున్నారు. ఆ సమయంలో ఇంజిన్‌కు అనుకోకుండా విద్యుత్ తీగలు తగిలాయి. వాటిని ఇంజిన్ సుమారు 100 నుంచి 150 మీటర్లు లాక్కుని వెళ్లింది. దీనిని గుర్తించిన సిబ్బంది వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపివేసి ప్రయాణికులను అప్రమత్తం చేశారు. ఈ ప్రమాదంలో రైలు ఇంజిన్‌కు మాత్రమే విద్యుత్ తీగలు తగలడంతో తీవ్ర ప్రమాదం తప్పింది. రైల్వే అధికారులు యుద్ధప్రాతిపదికన విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపట్టి రైళ్లను పునరుద్ధరించారు. ఉదయం మిగతా 2లో..

వర్షాలతో రహదారులు ఛిద్రం

▶ వార్త 5లో..

నివాసాల్లోనే అనధికార పశుకబేళాలు

▶ వార్త 3లో..

కొల్లూరికి పిఆర్ఎస్ఐ జీవిత సాఫల్య పురస్కారం

▶ వార్త 3లో..

అవార్డు స్వీకరిస్తున్న రమణమూర్తి

జివిఎంసికి జాతీయ స్థాయి అవార్డు

ఉత్తమ ప్రజా అవగాహన కార్యక్రమం కేటగిరీలో ప్రథమ స్థానం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసికి పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా - 2024 జాతీయ స్థాయి పురస్కారం దక్కింది. 'ఉత్తమ ప్రజా అవగాహన కార్యక్రమం' కేటగిరిలో జివిఎంసి ప్రథమ స్థానంలో నిలిచి ఈ అవార్డును కైవశం చేసుకుంది. విశాఖ నగర ప్రజల సంపూర్ణ సహకారంతోనే ఈ అవార్డు దక్కిందని జివిఎంసి కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ ఆదివారం తెలిపారు. ఈ నెల 20 నుంచి 22వ తేదీ వరకు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని రాయపూర్‌లో జరిగిన 46వ ఆల్ ఇండియా పబ్లిక్ రిలేషన్స్ కాన్ఫరెన్స్‌లో ఈ జాతీయ స్థాయి అవార్డు మిగతా 2లో..

త్వరలో 2 వేల ఎలక్ట్రిక్ బస్సులు

రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : త్వరలో 2 వేల ఎలక్ట్రిక్ బస్సులు రాష్ట్రంలో అందుబాటులోకి రానున్నాయని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. ఉత్తరాంధ్ర పర్యటనలో భాగంగా ఆదివారం ఉదయం మద్దిలపాలెం డిపోలో ఆయన ఒక సూపర్ లగ్జరీ, 3 ఎక్స్ ప్రెస్ బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ బస్సులను విశాఖపట్నం నుంచి పాడేరు, విజయనగరం, అమలాపురం మార్గాలలో ప్రయాణికుల అవసరాల నిమిత్తం ఏర్పాటు చేశామన్నారు. భవిష్యత్తులో మరిన్ని కొత్త బస్సు సర్వీసులు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ప్రభుత్వానికి ప్రయాణికులు, కార్మికులు రెండు కళ్లు వంటివారన్నారు. కార్మికుల ఇబ్బందులు తీర్చడానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ

బస్సు సర్వీసులను ప్రారంభిస్తున్న మంత్రి రాంప్రసాద్

ముందుంటుందని చెప్పారు. గౌరవ అతిథిగా పాల్గొన్న గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సుల ఏర్పాటుకు కమిటీని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఆర్టీసీకి నష్టం వాటిల్లకుండా మహిళలకు ఉచిత బస్సు మిగతా 2లో..

ఉద్యమ స్ఫూర్తితో ముందుకు..

మొదటి పేజీ తరువాయి..

జివిఎంసికి జాతీయ స్థాయి అవార్డు

దక్కినట్టు ఆయన వెల్లడించారు. కాన్ఫరెన్స్‌లో జాతీయ ఎస్‌టి కమిటీ మాజీ చైర్మన్, పార్లమెంట్ సభ్యులు డాక్టర్ నందకుమార్ సాయి, పిఆర్ఎస్ఐ నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ అజిత్ పాఠక్, నేషనల్ జనరల్ సెక్రటరీ, స్వచ్ఛ విశాఖ అంబాసిడర్ డాక్టర్ పివిఎల్‌కె.మూర్తి నుంచి ఈ అవార్డును జివిఎంసి తరపున అదనపు కమిషనర్ డివి.రమణమూర్తి, పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ ఎన్.నాగేశ్వరరావు స్వీకరించినట్టు తెలిపారు. విశాఖ నగరాన్ని పరిశుభ్రమైన, ఆహ్లాదకరమైన, పర్యావరణహితమైన, సుందర నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు.

త్వరలో 2 వేల ఎలక్ట్రిక్ బస్సులు

వాగ్దానం నెరవేరేలా తొందరలోనే చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం గడిచిన సంవత్సర కాలంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన డ్రైవర్లు, కండక్టర్లకు మంత్రి చేతుల మీదుగా పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ జోనల్ చైర్మన్ దొన్ను దొర, డిస్ట్రిక్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ ఆదినారాయణ, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, విజయనగరం జోనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.విజయ్ కుమార్, జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు, డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ జి.సత్యనారాయణ డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ కె.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ పురస్కారాలు

డ్రైవర్ల విభాగంలో శేఖర్, కెకెహెచ్.ప్రసాద్, ఆర్‌వి.నాయుడు, యుఎస్.చలం, ఎస్‌కెఎన్.రావు, ఇ.రమేష్‌లు ఉత్తమ పురస్కారాలకు ఎంపిక కాగా, ఉత్తమ కండక్టర్ల విభాగంలో జిజి.మూర్తి, కెఎన్.రాజు, ఎంజి.రావు, ఎం.రాజు, ఒఎస్ఆర్.రాజు, పిఎస్‌బి.రావు, పి.నగేష్ ఎంపికయ్యారు.

రైల్వే స్టేషన్‌లో తప్పిన ప్రమాదం

5:40 గంటలకు విశాఖపట్నం చేరుకున్న 22606 పురులియా ఎక్స్‌ప్రెస్ 6 గంటలకు విశాఖ నుంచి బయలుదేరాల్సి ఉండగా 9:17 గంటలకు ప్లాట్ ఫారం 3 నుండి బయలుదేరింది.

అలాంటిదేమీ లేదు : రైల్వే అధికారులు

సంఘటనపై అధికారులను వివరణ కోరగా విశాఖ రైల్వే స్టేషన్‌లో ఓవర్ హెడ్ ఎక్విప్‌మెంట్ మెయింటెనెన్స్ పనులు జరుగుతున్నాయని, అందులో భాగంగా మూడో నెంబర్ ప్లాట్ ఫారం వైర్‌ను మార్చామని రైల్వే అధికారులు తెలిపారు. అంతే తప్ప ప్రమాదమేమీ లేదని, అన్ని రైళ్ల రాకపోకలు యథావిధిగా నడుస్తున్నాయని పేర్కొన్నారు. మూడో నెంబర్ ప్లాట్ ఫారం దక్షిణ దిశలో జరుగుతున్న మరమ్మతుల పనుల సమయంలో రైళ్ల రాకపోకల వ్యవస్థకు ఒక గంట సేపు అంతరాయం కలిగిందని తెలిపారు.

ఇళ్ల నిర్మాణాలపై దృష్టి

'ప్రజాశక్తి'తో జిల్లా హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు

ప్రజాశక్తి - అనకాపల్లి

జిల్లాలో ప్రజల ఇళ్ల నిర్మాణాలపై దృష్టి సారించామని జిల్లా హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ వై.శ్రీనివాసరావు తెలిపారు. ఇప్పటికే పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నామన్నారు. జిల్లాలో ప్రభుత్వం చేపడుతున్న హౌసింగ్ స్కీముల నిర్వహణ, ప్రస్తుతం వాటి స్థితి, జిల్లాకు ఇచ్చిన లక్ష్యం, ఇంతవరకు పూర్తయిన ఇళ్ళ తదితర అంశాలను ఆయన 'ప్రజాశక్తి'కి వివరించారు.

జిల్లాలో హౌసింగ్ స్కీమ్ వివరాలు తెలియజేస్తారా ?

ప్రస్తుతం జిల్లాలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన, వైఎస్ఆర్ రూరల్, వైఎస్ఆర్ అర్బన్ స్కీముల్లో ఇండివిడ్యువల్ లేఅవుట్‌లో ఆప్షన్ 1, 2, అలాగే జగనన్న లే అవుట్లలో ఆప్షన్ 3 కింద ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. 2014- 19లో ఎన్‌టిఆర్ హౌసింగ్ స్కీమ్ కింద కట్టి అసంపూర్తిగా ఉన్న ఇళ్లు ఉన్నాయి. వాటిని ప్రస్తుతం వెరిఫికేషన్ చేసి పేమెంట్లు చెల్లించేందుకు సిద్ధమవుతున్నాం.

ఏపి స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా చేపట్టిన కార్యక్రమాలేంటి ?

ఆంధ్రప్రదేశ్ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా జిల్లాలో ఉన్న 24 మండలాల్లో ఇళ్ల నిర్మాణం జరుగుతోంది. అనకాపల్లి జిల్లాకు 6643 ఇళ్ల లక్ష్యం ఉంది. దీనిలో అర్బన్‌లో 2670, గ్రామీణ ప్రాంతంలో 2464 మొత్తం 5163 ఇళ్ల నిర్మాణం పూర్తయింది. ఇంకా 1480 ఇళ్లు బేస్‌మెంట్, లెంటిల్ లెవెల్, రూఫ్, ఆర్‌సిసి దశల్లో ఉన్నాయి. ప్రస్తుతం జిల్లాలో 77.7 శాతం ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి.

ప్రస్తుతం వీరికి ఇస్తున్న స్కీం అమౌంట్ ఎంత ?

ప్రస్తుతం ఒక్కో ఇంటికి రూ.లక్షా 50 వేలను ప్రభుత్వం, 30 వేలను ఎన్ఆర్ఇజిఎస్ కింద మొత్తం 1,80,000 అందిస్తున్నాం. ప్రభుత్వ నూతన పాలసీ అమలు జరిగితే 2025 ఆర్థిక సంవత్సరంలో రెండు లక్షలా 80 వేల రూపాయల వరకు వచ్చే అవకాశముంది.

జెండాను ఆవిష్కరిస్తున్న త్రిమూర్తులు రెడ్డి

(మొదటి పేజీ తరువాయి..) మళ్ల సత్యనారాయణ వేదికగా జరిగిన ప్రతినిధుల సభను ఉద్దేశించి వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ స్థానిక సమస్యలను అధ్యయనం చేసి వాటి పరిష్కారానికి పోరాటాలు నిర్వహించాలన్నారు. పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.జగ్గు నాయుడు మాట్లాడుతూ కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలపైనా, మతోన్మాదానికి వ్యతిరేకంగా బలమైన ప్రజా పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. పోరాటాలతో స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను అడ్డుకోవాలన్నారు. జిల్లా కార్యదర్శి కె.లోకనాథం ప్రవేశపెట్టిన నివేదికను మహాసభ ఆమోదించింది.

ప్రజా సమస్యలపై ఐక్య ఉద్యమాలు

- సిపిఐ జిల్లా కార్యదర్శి వెంకటరమణ

ప్రజా సమస్యలపై వామపక్షాలు ఐక్య కార్యాచరణతో ఉద్యమాలు నిర్వహించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బి.వెంకటరమణ అన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ 6 హామీలను అమలు చేయాలన్నారు. సిపిఎం 24వ మహాసభలో ఆయన సౌహార్ద సందేశమిస్తూ పాలక, ప్రతిపక్షాలు మోడీకి భయపడి కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను సమర్థిస్తున్నాయని అన్నారు. ప్రత్యామ్నాయ శక్తిగా వామపక్షాలు ఎదిగేలా పోరాటాలు కొనసాగించాలన్నారు.

సీనియర్లకు సన్మానం

సిపిఎం సీనియర్ నాయకులు సాపిరెడ్డి నారాయణమూర్తి, త్రిమూర్తులు రెడ్డి, కెవి.సూర్య ప్రభ, జి.నాయినిబాబు, ఎల్.గౌరి, సదాశివ, సాంబశివరావు, నాగిరెడ్డి సత్యనారాయణలను మహాసభలో సత్కరించి గౌరవించారు.

పార్టీ జిల్లా మహాసభ ముగింపు సందర్భంగా వారికి పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, కిల్లో సురేంద్ర, కె.లోకనాథం, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.జగ్గునాయుడు, తదితరులు పుష్పగుచ్ఛం ఇచ్చి, శాలువా కప్పి సన్మానించారు.

సత్కారం అందుకున్న సీనియర్ కామ్రేడ్స్

నూతన జిల్లా కమిటీ సభ్యులతో రాష్ట్ర నాయకులు

22 తీర్మానాలు ఏకగ్రీవ ఆమోదం

జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని జిల్లా మహాసభ డిమాండ్ చేసింది. సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి తగిన నిధులు కేటాయించి ఖర్చు చేయాలని పేర్కొంది. తొలుత పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.కోటేశ్వరరావు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానంపై అమరులకు మహాసభ ఘన నివాళులర్పించింది. జిల్లా సమగ్రాభివృద్ధిపై జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని బి.ప్రభావతి బలపర్చారు. జిల్లాలో వివిధ ప్రాంతాల్లోని ప్రధాన అంశాలకు సంబంధించి ప్రవేశపెట్టిన 22 తీర్మానాలకు మహాసభ ఆమోదం తెలిపింది.

1. జిల్లా సమగ్రాభివృద్ధికి చర్యలు చేపట్టాలి
2. పరిశ్రమల్లో ప్రమాదాలను నివారించాలి. కార్మికులకు భద్రత కల్పించాలి.
3. నాన్ షెడ్యూల్ గిరిజన ప్రాంతాలను ఐదో షెడ్యూల్‌లో చేర్చాలి. మైనింగ్ తవ్వకాలను వెంటనే ఆపాలి
4. జిల్లాలో ఎస్ఇజెడ్, పరిశ్రమల కోసం భూములు కోల్పోతున్న నిర్వాసితులకు పరిహారం ఇవ్వాలి. 2013 భూసేకరణ చట్టం ప్రకారం ప్యాకేజీ చెల్లించాలి.
5. విశాఖ ఉక్కును కాపాడుకోవాలి.
6. గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని బలోపేతం చేయాలి. రోజు కూలి రూ.600 ఇవ్వాలి. ఏడాదికి 200 రోజులు పని కల్పించాలి
7. మహిళలు, చిన్నారులపై లైంగిక దాడులు నివారించాలి. మహిళా రక్షణ చట్టాలను అమలు చేయాలి.
8. మూడు సహకార షుగర్ ఫ్యాక్టరీలు పునరుద్ధరించాలి.
9. కాలుష్యాన్ని నియంత్రించాలి. పర్యావరణాన్ని పరిరక్షించాలి.
10. నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలి.
11. స్కీం వర్కర్లకు కనీస వేతనం రూ.20 వేలు ఇవ్వాలి. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి.
12. ఎస్ఇజెడ్‌లో కార్మిక చట్టాలు అమలు చేయాలి.
13. ప్రభుత్వ సంక్షేమ హాస్టల్స్‌కు సొంత భవనాలు కేటాయించాలి.
14. డాక్టర్ ఎంఎస్.స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం రైతులు పండించిన పంటకు మద్దతు ధర ఇవ్వాలి
15. చేతివృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలి.
16. సాగు ఆధారంగా కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలి. బ్యాంకు రుణాలు ఇవ్వాలి.
17. పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం ఉద్యోగాలివ్వాలి. ఖాళీ పోస్టులు భర్తీచేయాలి.
18. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పూర్తిచేయాలి. సాగునీటి వనరులను మెరుగుపర్చాలి.
19. ఇసుక ఉచితంగా ఇవ్వాలి.
20. పాల రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి. బోనస్ ఇవ్వాలి
21. జీడీ, మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి. రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలి
22. విద్యుత్ సర్దుబాటు ఛార్జీలను రద్దు చేయాలి.

IN THE HONOURABLE COURT OF THE XI ADDITIONAL DISTRICT JUDGE AT VISAKHAPATNAM
O.S. 432 /2018

Between:
Smt. Piridi Madhavi ... Plaintiff
And :
Mr. Saragadam Santhosh Kumar and 5 others ...Defendants
To
R6...M/S. Kanakamani Constructions, Rep.By its Managing Partner,
Sri. Sanapala Satyanarayana, S/O Late Seetaramaiah,D.No. 39-9-96/1, Tenneti Nagar, Madhavadhara, Visakhapatnam.

NOTICE

Please take notice that the Honourable Court was pleased to order notice to you in the above matter through this publication as the above plaintiff filed the above suit for permanent injunction against you and others, Therefore you are hereby called upon to appear before this Honourable Court on **10-01-2025 at 10.30 A.M.**, personally or through an Advocate. If you fail to appear before this Honourable Court on that day the matter will be heard in your absence and necessary orders will be passed against you.

Sri. N.S.V.REDDY
Advocate,
N.G.G.O's Colony,
Akkayapalem,
Visakhapatnam-16
Mobile:9393102036

Visakhapatnam
Dt. 21-12-2024

మహారాజశ్రీ నర్సాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టు నందు
ఎఫ్.డి.ఐ.ఎ.నెం.1/2004
ఓ.యస్.నెం.51/2015

Between:
మండ వివేకానంద ...పిటీషనరు/వాది
మరియు
ఎరుబండి వెంకట సుబ్బలక్ష్మి వగైరా ...రెస్పాండెంట్లు/ప్రతివాదులు

టు
రెస్పాండెంట్ :
1. ఎరుబండి వెంకట సుబ్బలక్ష్మి, భర్త : సత్యనారాయణ, ప్లాటు నెం.15, విజయ జ్యోతి అర్కెడు, విశాలక్షినగర్, విశాఖపట్నం.

పై నెంబరు పిటిషనర్ మహారాజశ్రీ నర్సాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) కోర్టు వారి ఫైలులో O.S.No.51/2015 ప్రిలిమినరీ డిక్రీ ప్రకారం ఫైనల్ డిక్రీ ఇప్పించవలసినదిగా కోరుచు ఎఫ్.డి.ఐ.ఎ.నెం. 1/2024రున పైకోర్టు వారి ఎదుట పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్ నందు మీకు నోటీసులు ఎన్నిమార్లు పంపించిననూ మీరు తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నందున పై నెంబరు గ్రంథములో మీపై పేపర్ ప్రకటన ద్వారా నోటీసు అమలు చేయుటకు కోర్టు వారు ఉత్తర్వులు జారీ చేసియున్నారు. సదరు గ్రంథములో మీరు **10-01-2025** తేది ఉదయం గం.10.30 ని॥ల నుండి స్వయముగా గాని న్యాయవాది ద్వారా గాని హాజరై అభ్యంతరములు తెలియజేసుకొనుటకు వాయిదా వేసినారు. కావున మీరు ఆరోజున హాజరై అభ్యంతరములు తెలియజేసుకొనవలెనన్ని లేనిచో సదరు పిటిషన్ మీ పరోక్షముగా తీర్మానించబడునని తెలియజేయడమైనది.

సరిపల్లి రామ సత్యయ్య
అడ్వకేట్
నర్సాపురం
ది.22-12-2024 సెల్: 9848837555

నివాసాల్లోనే అనధికార పశుకబేళాలు

అనధికార కబేళాలకు పశువుల తరలింపు

- వ్యర్థాలతో కంపుకొడుతున్న పరిసరాలు
- చోద్యం చూస్తున్న జివిఎంసి వైద్యాధికారులు

ప్రజాశక్తి - ఆరిలోవ : ఆరిలోవ ప్రాంతంలో నివాసాల్లోనే అనధికార పశుకబేళాలు నిర్వహిస్తున్నారు. దీంతో పరిసర ప్రాంతాలు దుర్గంధంతో కంపుకొడుతున్నాయి. బహిరంగంగానే అనధికార పశు కబేళాలు జరుగుతున్నా జివిఎంసి వైద్యాధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనితో పశు మాంసం వ్యాపారస్తులు విచ్చలవిడిగా వ్యాపారాలు సాగిస్తున్నారు. ఆరిలోవ 11వ వార్డు ముస్తాఫా కాలనీలో కొన్ని నివాసాల్లోనే అనధికారికంగా పదుల సంఖ్యలో పశు కబేళాలు నిర్వహిస్తున్నారు. నిబంధనల ప్రకారం పశు మాంసం విక్రయించే వ్యాపారస్తులు పశువులను జివిఎంసి ఆధ్వర్యాన అధికారికంగా నిర్వహించే పశుకబేళాకు తీసుకెళ్లాలి. అక్కడ పశువుల వయసు, వాటి ఆరోగ్య పరిస్థితిని వైద్యుల పరిశీలించి, అవి ఆరోగ్యంగా ఉన్నాయనే నిర్ధారణకు వచ్చిన తరువాత అక్కడే కటింగ్ చేస్తారు. అక్కడి నుంచి తెచ్చిన పశు మాంసాన్ని దకాణాల్లో విక్రయించాలి. అవి ఏమీ చేయకుండానే సంతల్లో పశువులను కొని నేరుగా నివాసాలకు తీసుకొచ్చి కటింగ్ చేసి అక్కడే విక్రయాలు జరుపుతున్నారు. నివాసాల మధ్యనే అర్ధరాత్రి పూట పశువులను వధించడంతో వాటి అరుపులకు చుట్టు పక్కల నివాసాల వారు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పశువుల వ్యర్థాలు కాలువల్లో పారడంతో పరిసర ప్రాంతాలు కంపుకొడుతున్నాయి. ఇప్పటికైనా జివిఎంసి వైద్యాధికారులు అనధికార పశు కబేళాలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నేరాలు ఘోరాలు

చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి -మధురవాడ : పోతిన మల్లయ్యపాలెం పోలీస్ స్టేషన్ పరిధి శ్రీరామ్ ప్రాపర్టీలో చోరీకి పాల్పడిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు నేర విభాగపు ఎసిపి వెంకటరావు తెలిపారు. పిఎం.పాలెం స్టేషన్‌లో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఈ ఏడాది ఆగస్టు 8వ తేదీన పనోరమ హిల్స్ శ్రీరామ్ ప్రాపర్టీలో చోరీ జరిగింది. ఫిర్యాదుదారులు కొసరెడ్డి వెంకట సీతా మహాలక్ష్మి సంధ్యా దేవి భర్త కొప్పర్తి వెంకటేశ్వరరావు ఆర్కిడ్స్ 43 ఎ పనోరమా హిల్స్, శ్రీరామ్ ప్రాపర్టీస్‌లో నివాసముంటున్నారు. కెజిహెచ్‌లో డాక్టర్లుగా పని చేస్తున్నారు. ఇంటికి తాళాలు వేసి ఆగస్టు 8వ తేదీ మధ్యాహ్నం భీమవరం వెళ్లారు. తిరిగి 9వ తేదీ మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఇంటికి వచ్చేసరికి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఇంట్లో గల సుమారు 1040 గ్రాములు కలిగిన బంగారం వస్తువులు, నగదు రూ.20 లక్షలు చోరీ జరిగినట్లు గుర్తించి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు పిఎం పాలెం నేరవిభాగపు సిఐ ప్రకాష్ ఆధ్వర్యాన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. వెలిముద్రలు ఆధారంగా మధ్యప్రదేశ్‌లోని దార్ జిల్లా టర్పింగ్ గ్రామానికి చెందిన కుందన్, సురేష్‌లతో పాటు మరి కొందరిని పోలీసులు గుర్తించారు. ఎ2గా ఉన్న సురేష్‌ను పిఎం.పాలెం లాకాలేజీ రోడ్డులో పట్టుకున్నారు. అతడి నుంచి రూ.5 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు ఎసిపి తెలిపారు. మిగిలిన బంగారం, నగదును తొందరలోనే రికవరీ చేస్తామని ఆయన తెలిపారు. ఈ కేసును ఛేదించిన ఎస్ఐ ఆర్.శ్రీనివాసరావు, ఎం బాలరాజు, హసీనా బేగం, గణేష్, ఎల్.రమేష్, జె.నాగరాజు, ఎమ్‌డి అయ్యుబ్, జెఎం.మల్లిక్, సంతోష్, పి.రవినాయక్ తదితర సిబ్బందిని అభినందించారు.

చిట్టీల పేరుతో మోసం చేసిన.. దంపతులపై కేసు

ప్రజాశక్తి -భీమునిపట్నం : వివిధ పండుగలు సందర్భంగా చిట్టీల పేరుతో రూ.47.40 లక్షలు వసూలు చేసి మోసం చేశారన్న బాధితుల ఫిర్యాదు మేరకు జివిఎంసి రెండో వార్డు పరిధి నమ్మివానిపేటకు చెందిన దంపతులు సరగడ పార్వతి, లక్ష్మణ‌పై స్థానిక పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. సిఐ సుధాకర్ కథనం ప్రకారం.. నమ్మివానిపేటకు చెందిన భార్యాభర్తలు పార్వతి, లక్ష్మణ కలిసి వలంధపేటలో దసరా తదితర పండుగలు సందర్భంగా చిట్టీల పేరుతో రూ 47.40 లక్షలు వసూలు చేశారు. 2020 నుంచి ఇదే తరహాలో చిట్టీలు వేస్తున్నారు. చిట్టీలు కట్టిన వారికి 2022 నుంచి చెల్లింపులు చేయలేదు. దీంతో వలంధపేటకు చెందిన బాధితురాలు కోసన అప్పలకొండ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు దంపతులపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

11 మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి -అనకాపల్లి : అనకాపల్లి పట్టణంలో సుంకరమెట్ట జంక్షన్ వద్ద అక్రమంగా రవాణా చేస్తున్న 11 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు అనకాపల్లి పట్టణ ఎస్.ఐ ఈశ్వరరావు తెలిపారు నక్కపల్లి మండలం పాటిమీద గ్రామానికి పెంటకోట నానిపై కేసు నమోదుచేసి అరెస్టు చేశామన్నారు. .

టైలర్లను ఆదుకోవాలి

ప్రజాశక్తి -తగరపువలస : ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన టైలర్లను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని ఎపి టైలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు గిడుతూరి శ్రీనివాసరావు కోరారు. గత ప్రభుత్వం విధులు, నిధులు లేని డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కొద్ది మందికి మాత్రమే ఏడాదికి ఒకసారి రూ.10 వేలు ఇచ్చి మెజారిటీ టైలర్లకు గత ప్రభుత్వం అన్యాయం చేసిందని విమర్శించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు.



రోగిని పరీక్షిస్తు న్న డాక్టర్ నవీన్ గుప్తా

150 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక మెయిన్ రోడ్డు ఆంజనేయస్వామి ఆలయం ఎదురుగా ఉన్న శ్రీనివాస హెల్త్ కేర్ వద్ద ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆసుపత్రి మొదటి వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన ఈ వైద్య శిబిరంలో ఆసుపత్రి వైద్యులు డాక్టర్ సిహెచ్.నవీన్‌గుప్తా, ఎముకలు, కీళ్ల వైద్య నిపుణులు డాక్టర్ ఎం.పవన్ కుమార్ రోగులను పరీక్షించారు. సుమారు 150 మంది రోగులకు ఉచితంగా రక్త, మధుమేహం, ఎముకల సాంద్రత నిర్ధారణ తదితర పరీక్షలు చేశారు. మందులు ఉచితంగా అందజేశారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

ప్రజాశక్తి -భీమునిపట్నం : మనో మెలోడిస్ ఆధ్వర్యాన జిల్లా సింగర్స్ పిక్నిక్ స్థానిక బీచ్‌లోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఉత్సాహంగా, ఉల్లాసంగా నిర్వహించారు. నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు 350 మంది సింగర్లు హాజరయ్యారు. తెలుగు సినిమాల్లోని పలు గీతాలు పాడుతూ ఉర్రూతలూగించారు.

యోగా జట్లు ఎంపిక

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఎయు ఇంటర్ యూనివర్సిటీ యోగా మహిళలు జట్టు, ఆంధ్రాయూనివర్సిటీ పురుషులు, మహిళలు యోగా జట్లు ఎంపిక ఆదివారం నిర్వహించారు. ఎంపికైన క్రీడాకారులను విజయమోహన్ అభినందించారు.

అమిత్‌షా వ్యాఖ్యలపై దళితుల రాస్తారోకో

ప్రజాశక్తి -యంత్రాంగం

తగరపువలస : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌నుద్దేశించి పార్లమెంట్‌లో అవమానకరంగా మాట్లాడిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాను మంత్రి పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ దళితులు ఆదివారం భీమిలి మండలం తాళ్లవలస జంక్షన్‌లో రాస్తారోకో నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు బోని సన్నిబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాల మహానాడు వ్యవస్థాపకులు భాగం గోపాలరావు, కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు భాగం లక్ష్మి మాట్లాడుతూ, కుల మతాలకతీతంగా పాలన చేస్తామని చెబుతూ రాజ్యాంగంపై ప్రమాణం చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అందుకు భిన్నంగా వ్యవహరించడం ఏ మేరకు సబవని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం ప్రతినిధులు బోని నరసింగరావు, బి.హరిబాబు, సియ్యాద్రి రాంబాబు, బి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అమిత్ షా రాజీనామా చేయాలి

అనకాపల్లి : అంబేద్కర్‌పై పార్లమెంట్‌లో అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా తన పదవికి రాజీనామా చేయాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దొరబాబు డిమాండ్ చేశారు. ఆదివారం అనకాపల్లి నాలుగు రోడ్ల జంక్షన్ లో అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఐ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. .అనంతరం గౌతమ బుద్ధుని విగ్రహానికి విజ్ఞానపత్రం అందజేశారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు మహా జ్ఞాని గౌతమబుద్ధుడు జ్ఞానోపదేశం చేయాలని కోరారు. కార్యక్రమంలో బి.బాబ్జి, ఎం.యర్రియా, కోరిబిల్లి శంకరరావు, వీరూ యాదవ్, సత్యనారాయణ, సింహాద్రి, జగదీష్ పాల్గొన్నారు.

కొల్లూరికి పిఆర్ఎస్ఐ జీవిత సాఫల్య పురస్కారం

ప్రజాశక్తి -మధురవాడ : నాలుగు దశాబ్దాల పాటు విశాఖలోని వివిధ కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో ప్రజా సంబంధాల అధికారిగా, భారత ప్రజా సంబంధాల సంఘం (పిఆర్ఎస్ఐ) విశాఖ శాఖ అధ్యక్షుడిగా విశేష కృషిచేసిన విశాఖకు చెందిన కొల్లూరి రామారావు పిఆర్ఎస్ఐ జీవిత సాఫల్య పురస్కారాన్ని అందుకున్నారు. ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయపూర్‌లో జరుగుతున్న పిఆర్ఎస్ఐ జాతీయ సమావేశాల్లో రాజ్యసభ మాజీ సభ్యుడు డాక్టర్ నందకుమార్ సాహి చేతులమీదుగా పిఆర్ఎస్ఐ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ అజిత్ పాఠక్ సమక్షంలో రామారావు అవార్డును స్వీకరించారు. 1974 సంవత్సరంలో ప్రఖ్యాత హిందుస్థాన్ షిప్ యార్డులో ప్రజా సంబంధాల అధికారిగా బాధ్యతలు స్వీకరించిన కె.రామారావు 1977లో డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో పిఆర్ మేనేజర్‌గా పనిచేశారు. ఉద్యోగ విరమణ అనంతరం 2006 నుంచి 2023 సంవత్సరం వరకు శంకర్ ఫౌండేషన్ ప్రజా సంబంధాల విభాగం అధిపతిగా వ్యవహరించారు. ఇదే సమయంలో విశాఖలోని ప్రజా సంబంధాల అధికారులను ఏకతాటి పైకి తెచ్చి పిఆర్ఎస్ఐ శాఖను బలోపేతం చేయడంతో పాటు సభ్యులలో వృత్తి నైపుణ్యాలను పెంచడానికి కృషి చేశారు. కె.రామారావుకు జాతీయ అవార్డు లభించడం పట్ల పిఆర్ఎస్ఐ విశాఖ సభ్యులు అభినందనలు తెలిపారు.

అవార్డు అందుకుంటున్న రామారావు

జాతీయ చౌక్‌బాల్ పోటీలకు అసెంట్ విద్యార్థులు

ఎంపికైన విద్యార్థులతో అసెంట్ యాజమాన్య ప్రతినిధులు

ప్రజాశక్తి- ఆనందపురం : జాతీయస్థాయి చౌక్‌బాల్ పోటీలకు అసెంట్ విద్యార్థులు ఎంపికయ్యారు. విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో రాష్ట్ర చౌక్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఏపీ జట్ల ఎంపికలు నిర్వహించారు. ఎంపికైన జట్లును ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు హైదరాబాద్‌లో జాతీయ చౌక్‌బాల్ ఛాంపియన్ షిప్‌కు పంపుతామని రాష్ట్ర కార్యదర్శి సుధాకరరావు తెలిపారు. ఈ పోటీలలో ఆనందపురం మండలం పాలవలస అసెంట్ స్కూల్‌కు చెందిన నలుగురు విద్యార్థులు సిహెచ్ పార్థు, ఇ.రాంచరణ్, వి.ఉమామహేశ్వరరావు, టి.జగన్ ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులను రాష్ట్ర చౌక్‌బాల్ లీగల్ అడ్వైజర్ కార్తీక్ కిరణ్, విశాఖ జిల్లా సెక్రటరీ కమ్ పిఇటి గాదిపల్లి సురేష్, అసెంట్ స్కూల్ చైర్మన్ శంకర్రావు, డైరెక్టర్ బంగారునాయుడు అభినందించారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి -తగరపువలస : చిట్టివలస సత్య సాయి సేవా సమితి ఆధ్వర్యాన ఆదివారం స్థానికంగా ఉన్న 50 మంది పేదలకు దుప్పట్లు, మధ్యాహ్నం ఆహార పొట్లాలు అందజేశారు. స్థానిక అవంతి ఇంజినీరింగ్ కళాశాల హెచ్ఒడి రాజ్ గోపాల్ పట్నాయక్ సహకారంతో పేదలకు దుప్పట్లు పంపిణీ చేసినట్లు సత్య సాయి సేవ సమితి జోనల్ కో-ఆర్డినేటర్ ఎంఎ.సత్యసాయికుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మిక కో-ఆర్డినేటర్ టివిఆర్.బాబా, ఎడ్యుకేషన్ కో-ఆర్డినేటర్ జి.చిన్నారావు, సమితి సభ్యులు పి.చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

సంచార జాతులకు...

భీమునిపట్నం : ఫుట్ పాత్‌లు, రోడ్ల వెంబడి కటిక చలిలో నిద్రిస్తున్న 60 మంది అభాగ్యులకు స్థానిక కలిగొట్ల స్విర్ల శ్రీ దేవి ఫౌండేషన్ చైర్మన్ కె.శ్రీరామచంద్రమూర్తి శనివారం రాత్రి దుప్పట్లు, దుస్తులు, చీరలు, తు వ్వాళ్లు, స్టీల్ పాత్రలు, ఆహారపు పొట్లాలు అందజేశారు. శ్రీరామచంద్రమూర్తి తండ్రి కీర్తి శేషులు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కె.భాస్కరరావు 24వ వర్ధంతి సందర్భంగా పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు కె.భానోజీరావు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సిపిఎం విశాఖ జిల్లా మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

తగరపువలసలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి -యంత్రాంగం

తగరపువలస : పెందుర్తిలో ఈ నెల 28, 29 తేదీల్లో జరుగనున్న సిపిఎం జిల్లా 24వ మహాసభను జయప్రదంచేయాలని కోరుతూ స్థానిక సిఐటియు కార్యాలయం వద్ద ఆదివారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ జోన్ కార్యదర్శి ఆర్‌ఎస్‌ఎన్.మూర్తి మాట్లాడుతూ, ఈ నెల 28వ తేదీ ఉదయం 10 గంటలకు పెందుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణ నుంచి సుజాతనగర్ వరకు జరుగనున్న మహా ప్రదర్శన, అనంతరం నిర్వహించే బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రవ్వ నరసింగరావు, ఎస్.అప్పలనాయుడు, వి.నాగరాజు, ఎం.రాము, కె.నాగరాణి, భాగం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గాజువాక : సిపిఎం 24వ విశాఖ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ స్టీల్ జోన్ కమిటీ ఆధ్వర్యాన పెదగంట్యాడ సిఐటియు కార్యాలయంలో ఆదివారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జోన్ కమిటీ సభ్యులు బైరెడ్డి గురప్ప మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ సిపిఎం నిరంతర పోరాటాలు నిర్వహిస్తున్నదన్నారు. రానున్న రోజుల్లో స్మార్ట్ మీటర్లు, నీటి మీటర్లు ఏర్పాటు చేసి ప్రజలపై భారాలు వేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈ నెల 28, 29 తేదీల్లో జరిగే మహాసభలో భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు నమ్మి రమణ, జి.శ్రీనివాసరావు, కెఎం.శ్రీనివాస్, పి.అప్పలరెడ్డి, సిహెచ్.రాముడు, బి.సింహాచలం, కె.దుర్యోధన, ఎస్.దేవుడు, శశిభూషణ్ పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

క్రీడాకారులకు అభినందనలు

ప్రజాశక్తి-సీతమ్మధార : తమిళనాడు రాష్ట్రం పోలచ్చిలో జరిగిన 62వ జాతీయ రోలర్ స్కేటింగ్ పోటీలో మెడల్స్ సాధించిన సబ్బవరపు శంకర, బి.కార్తీక్ శరణ్య, లోహిత్ రెడ్డిని దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ సీతంపేటలోని జనసేన నగర కార్యాలయంలో అభినందించారు. అంతర్జాతీయ స్థాయిలో మెడల్స్ సాధించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. స్కేటింగ్ కోచ్‌లు పి.సత్యనారాయణ, ఇండియన్ కోచ్ కె.చిట్టిబాబు, ఆంధ్రప్రదేశ్ కోచ్‌లను ఎమ్మెల్యే అభినందించారు.

సేవ, ప్రేమ, క్షమ సర్వజనీన అంశాలు

ప్రజాశక్తి-సీతమ్మధార : సేవ, ప్రేమ, క్షమ అనేవి సర్వజనీన అంశాలని, అన్ని దేశాలు అనుసరించ దగినవనిడిసిఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ కెప్టెన్ ఎస్.దివాకర్ పేర్కొన్నారు. డాక్టర్ ఎల్‌బి.కాలేజీలో బివి ఫౌండషన్ ఫర్ పీస్ అండ్ హార్మోనీ, ఐఎఆర్‌ఎఫ్ సంస్థల ఆధ్వర్యాన క్రిస్మస్ వేడుకల సందర్భంగా సర్వ మత సామరస్యం అంశంపై సదస్సు నిర్వహించారు. ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడమ్ (ఐఎఆర్‌ఎఫ్) ఛైర్మన్ నరవ ప్రకాశరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముందుగా ముఖ్యఅతిథి డిసిఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ కెప్టెన్ ఎస్.దివాకర్ కేక్ కట్ చేసి సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా దివాకర్ మాట్లాడుతూ, క్రైస్తవం అంటే కృత్యజ్ఞతకు చిహ్నమని, ఆ విధంగా ప్రతి క్రైస్తవుడూ సమాజంలో మంచి మనసు కలిగి ఉండాలని కోరారు. క్రీస్తు బోధనలు ఆచరిస్తే యుద్ధాలు నివారించగలమన్నారు. వక్తలు డాక్టర్ సత్య, డాక్టర్ ప్రజ్ఞాన్ కుమార్, డాక్టర్ మున్నిరి, ప్రజాపిత బ్రహ్మకుమారి ప్రతినిధి రమ మాట్లాడుతూ, క్రీస్తు బోధనలు అనుసరణీయమన్నారు. ఈ సమావేశంలో ఉషారాణి, జోగారావు, డాక్టర్ గౌరి, డాక్టర్ బెనర్జీ, సీతల్, సత్యవతి తదితరులు పాల్గొన్నారు

మత్తుతో జీవితం చిత్తు

ప్రజాశక్తి-విశాఖపట్నం : మత్తు పదార్థాలకు బానిసైతే యువత జీవితం నాశనం అవుతుందని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాలల చీఫ్ వార్డెన్ ఆచార్య ఎస్.హరినాథ్ అన్నారు. మత్తుపదార్థాలకు వ్యతిరేకంగా ఆదివారం శాతవాహన హాస్టల్ ప్రాంగణంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో, విశ్వవిద్యాలయం ఉన్నతాధికారుల మార్గదర్శకంలో ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని డ్రగ్స్ రహిత క్యాంపస్‌గా తీర్చిదిద్దడం జరుగుతుందని అన్నారు. ఉన్నత ఆశయాలతో విశ్వవిద్యాలయంలో అడుగుపెట్టిన ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో ఉండాలని సూచించారు. ఆరోగ్యకరమైన అలవాట్లు కలిగి, ఉన్నత లక్ష్యాలను సాధించే దిశగా నిరంతరం శ్రమించాలని కోరారు. యువత ఎట్టి పరిస్థితుల్లోనూ మత్తుపదార్థాలకు బానిసలుగా మారకూడదని హితవు పలికారు. మత్తు పదార్థాల వల్ల ఆరోగ్యం, భవిష్యత్తు నాశనం అవుతాయని గుర్తించాలన్నారు. విద్యావంతులైన యువత దేశానికి ఉపయుక్తంగా నిలిచే ఉన్నత మానవ వనరులుగా మారాలని చెప్పారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రత్యేకంగా తీర్చిదిద్దిన బ్యానర్లను ప్రదర్శిస్తూ విద్యార్థుల్లో అవగాహన కల్పించారు. డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషిని విద్యార్థులకు వివరించారు.

విద్యార్థుల కళా ప్రతిభ

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్ర విశ్వవిద్యాలయం చిత్రకళా విభాగం విద్యార్థులు తమ కళా ప్రతిభతో నగరవాసుల మనసులను దోచుకుంటున్నారు. ఫైన్ ఆర్ట్స్ విభాగ విద్యార్థుల చిత్రకళా ప్రదర్శనకు కళాభిమానుల నుంచి, నగరవాసుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. ఈ సంవత్సరం విద్యార్థులు తమ ప్రతిభతో తయారుచేసిన చిత్రాలను ప్రదర్శించడంతోపాటు వాటి విక్రయాలను సైతం ఏర్పాటు చేశారు. విద్యార్థులు తయారుచేసిన కళాఖండాలను నగరవాసులు ఎంతో ముచ్చటపడి కొనుగోలు చేస్తున్నారు. నాణ్యమైన కళారూపాలు తక్కువ ధరకే ఇక్కడ లభిస్తుండడంతో శని ఆదివారాల్లో విక్రయాలు గణనీయంగా జరిగాయి. దీంతో విద్యార్థులు మరికొన్ని చిత్రాలను, శిల్పాలను తయారుచేసే పనిలో నిమగ్నం అవుతున్నారు.

రోడ్లు, కాలువలు ప్రారంభం

రోడ్లు, కాలువలు ప్రారంభ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

ప్రజాశక్తి -పెందుర్తి : మండలంలోని జెర్రిపోతులపాలెంలో సర్పంచ్ మడక అప్పలరాజు ఆధ్వర్యాన సుమారు రూ.10 లక్షలతో నిర్మించిన రోడ్లు, కాలువలను ఆదివారం ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు ప్రారంభించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటుచేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామాభివృద్ధిలో భాగంగా మౌలిక సదుపాయాల కల్పనకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. పంచాయతీ నిధులతో ప్రతి గ్రామానికీ డ్రెయినేజీలు, రోడ్లు నిర్మిస్తామని చెప్పారు. ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన ల్యాండ్ పూలింగ్ అవకతవకలపై విచారణ చెయ్యాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పెందుర్తి ఎంపిపి నాగమణి, మండల ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వెంకట్రావు, కూటమి నాయకులు మడక పార్వతి, మడక పైడిరాజు, సాలాపు అప్పారావు, మడక బంగారురాజు, కొరుపోలు రామానాయుడు, గల్లా శ్రీనివాసరావు, సాలాపు కనకరాజు, దాసరి రమణ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని నాలుగో పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ ఉమామహేష్ సూచించారు. అక్కయ్యపాలెం శంకరమఠం-డైమండ్ పార్క్ ప్రాంతాల్లో ఆదివారం వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం తాగి వాహనం నడపకూడదని, డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని, కార్లలో సీట్ బెల్ట్ ధరించాలని, మైనర్లు వాహనాలు నడపకూడదని తెలిపారు. వాహన తనిఖీల్లో పట్టుబడిన 14 మందికి జరిమానాలు విధించినట్లు చెప్పారు.

26న సిపిఐ శత వార్షికోత్సవాలు

ప్రజాశక్తి -గాజువాక : సిపిఐ శత వార్షికోత్సవాన్ని ఈ నెల 26న నిర్వహించనున్నట్లు ఆ పార్టీ గాజువాక నియోజక వర్గం కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ తెలిపారు. పెద గంట్యాడ పోతిన సన్యాసిరావు భవన్‌లో ఆదివారం శత వార్షికోత్సవ ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల 26న మధ్యాహ్నం 3 గంటలకు విశాఖ బీచ్ రోడ్ అల్లూరి విగ్రహం నుంచి ఆర్‌కె.బీచ్ వరకు సిపిఐ కార్యకర్తలతో కవాతు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు జి.ఆనంద్, కె.అచ్యుతరావు, అప్పారి విష్ణుమూర్తి, పి.దుర్గారావు, కె.పోతయ్య పాల్గొన్నారు.

సిఐగా ఆత్మకూరు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-సీతమ్మధార : విశాఖ పోర్ట్‌టౌన్ సిఐగా ఆత్మకూరు సత్యనారాయణ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. 2004 బ్యాచ్‌కు చెందిన ఆయన అనకాపల్లి రూరల్, బుచ్చయ్యపేట, ఎ.అన్నవరం, ఎ.కోడూరు, మునగపాక తదితర ప్రాంతాల్లో ఎస్ఐగా పనిచేశారు. 2021లో ప్రమోషన్ రావడంతో జి.మాడుగులలో సిఐగా ఫస్ట్ పోస్టింగ్ చేశారు. ఆ తర్వాత విజయనగరం సిసిఎస్‌లో పనిచేసి తాజాగా విశాఖ వచ్చారు. ఈ సందర్భంగా సిఐ సత్యనారాయణకు స్టేషన్ సిబ్బంది సాదరంగా స్వాగతం పలికారు. స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు పాటు పడతామన్నారు. ఇక్కడ పని చేసిన విజయకుమార్‌ను విశాఖ రేంజ్ విఆర్‌కు పంపించారు.

క్యాన్సర్ రోగులను ఆదుకోవాలి

మృతుని కుటుంబానికి నిత్యవసర సరుకులు అందజేస్తున్న లక్ష్మి, అప్పారావు తదితరులు

ప్రజాశక్తి -గాజువాక : క్యాన్సర్ రోగులను ప్రభుత్వం ఆదుకోవాలని హైకోర్టు న్యాయవాది అండిబోయిన లక్ష్మి కోరారు. పిట్టవానిపాలెంలో క్యాన్సర్‌తో మృతి చెందిన కుటుంబానికి ఆదివారం నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈ ప్రాంతంలో క్యాన్సర్ బాధితుల సంఖ్య పెరుగుతుందన్నారు. కాలుష్యం వల్ల అనేక మంది రోగాల బారిన పడుతున్నారన్నారు. యాత, శెట్టిబలిజ, గౌడ, ఈడిగ, శ్రీశైన సంక్షేమ సేవా సంఘం వైస్ ఛైర్మన్ అండిబోయిన అప్పారావు మాట్లాడుతూ, క్యాన్సర్ రోగులను ఆదుకోవడానికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి వనము నాగేశ్వరరావు, సభ్యులు అండిబోయిన వెంకటరమణ, బత్తిన రాము, దొమ్మేటి అప్పలరాజు, అండిబోయిన శ్రీను, అచ్చంనాయుడు, సన్యాసిరావు, నూకరాజు, రాము, అప్పలరాజు, పైడిరాజు, గోపి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటుచేయాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : ఆటో డ్రైవర్లు, మోటార్ కార్మికులకు పిఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్‌తో కూడిన సంక్షేమ బోర్డును రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేయాలని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి డిమాండ్‌చేశారు. ఈ మేరకు దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌కు సీతమ్మపేటలోని ఆఫీసులో వినతిపత్రం అందించారు. ఎమ్మెల్యేను ఆటో ఫెడరేషన్ నాయకులు యు శివాజీ సత్కరించారు. ఈ సందర్భంగా వామనమూర్తి మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలకు ఆటో డ్రైవర్లు, మోటార్ కార్మికులు సేవలు అందిస్తూ, ప్రభుత్వానికి రూ.కోట్లలో పనులు చెల్లిస్తున్నారని తెలిపారు. డ్రైవర్లు అనారోగ్యంతో మంచాన పడితే ఆయా కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైవర్ల అందరికీ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటుచేసి ఆదుకోవాలని, భారీగా జరిమానాలు పెంచుతూ గత ప్రభుత్వం విడుదల చేసిన జీవో 21, 31లను రద్దు చేయాలని, పెంచిన పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్, విద్యుత్ ఛార్జీల భారాలను తగ్గించాలని, డ్రైవర్లకు జీవనోపాధి కల్పించాలని కోరారు. ఎన్నికల్లో డ్రైవర్లకు చంద్రబాబు ఇచ్చిన హామీని అమలుచేస్తూ వాహన మిత్రను వెంటనే విడుదల చేయాలని, డ్రైవర్ల పిల్లలకు స్కూలు స్కాలర్‌షిప్ మంజూరు చేయాలని, ఆటో డ్రైవర్లకు సొంత ఇల్లు ఇచ్చి ఆదుకోవాలని, రోడ్లను పక్కాగా వేసి ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌యాదవ్ స్పందిస్తూ ఆటో డ్రైవర్ల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో భాస్కర్, వెంకట్, దేవుడు తదితరులు పాల్గొన్నారు.

ముంపు బాధిత రైతులను ఆదుకోవాలి

- కుళ్లిన వరిచేను చూసి కన్నీరు పెడుతున్న అన్నదాతలు
- ప్రభుత్వ చేయూతకు ఎదురుచూపులు

ప్రజాశక్తి -రాంబిల్లి : అల్పపీడన ప్రభావంతో మూడు రోజులుగా కురిసిన వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో వందలాది ఎకరాల్లో వరిపంటకు తీవ్రనష్టం వాటిల్లింది. అనేక ఎకరాల్లో కోసిన వరిచేను పొలాల్లో ఉండగా వర్షం కురియడంతో వరి పనలు తడిసిపోయాయి. అలాగే కొన్ని చోట్లు కోత కోయని వరిచేను వాలిపోయి నేలనంటిపోయిన తర్వాత వర్షం కురవడడంతో వెన్నుల్లోని గింజలు మొలకెత్తి తీవ్రనష్టం జరిగిందనిరైతులు అంటున్నారు.

మండలంలో చిన్నకల్లపల్లి, లోవపాలెం, రాజాల కొత్తూరు. మా గుడివాడ, .దిమిలి, గోకువాడ, వైలోవ, ఎలుసూరు, రాజుల కోడూరు,. లాలం కోడూరు తదితర గ్రామాల్లో దాదాపు ఐదు వేల ఎకరాల్లో వరిపంట ఈవిధంగా నీట మునిగి నష్టం వాటిల్లిందని బాధిత రైతులు వాపోతున్నారు. బాధిత రైతులకు ప్రభుత్వపరంగా పంట నష్టపరిహారం ఇవ్వాలని లోవ-

వర్షపునీటిలో మునిగిన వరి పనలను చూపుతున్న రైతు

పాలెం గ్రామ రైతు కన్నెపిల్ల గణేష్ మొరపెట్టుకున్నాడు. మూడు రోజులుగా నీటిముంపు, తడిగా ఉండడంతో వరిపనలతోపాటు చేనుపైనా ధాన్యం మొలకెత్తి,నష్టంజరిగిందని ఆవేదన వెలిబుచ్చారు

అచ్యుతాపురం : పంట చేతికి వచ్చే దశలో కురిసిన వర్షాలతో తీవ్రంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని టిడిపి బిసి సెల్ జిల్లా అధికార ప్రతినిధి కర్రి ఆదిబాబు, ఉప్పవరం గ్రామ ఉపసర్పంచ్ కూనిశెట్టి సత్తిబాబు ప్రభుత్వాన్ని కోరారు.

ఈదురుగాలులు అకాల వర్షాలతో చేతికి అంది వచ్చిన పంట నేలన పడి నీటిలో మునిగి కుళ్ళి మొలకలెత్తి రైతులను కుదేలు పరిచిందని ఆవేదన వెలిబుచ్చారు. వర్షంలో తడిసి రంగుమారి నాణ్యత చెడిన ధాన్యాన్ని నేరుగా రైతుల పొలాల వద్దకే వచ్చి కొనుగోలు చేయాలని,బాధిత రైతులకు నష్టపరిహారమిచ్చి ఆదుకోవాలని కోరారు.

28న గౌరీ పరమేశ్వరుల ఉత్సవం

పోస్టర్ ఆవిష్కరిస్తున్నపీలా గోవింద

ప్రజాశక్తి- అనకాపల్లి : ఈ నెల 28వ తేదీన నిర్వహించే స్థానిక విజయరామరాజు పేట గౌరీ పరమేశ్వరుల ఉత్సవ పోస్టర్‌ను స్థానిక టిడిపికార్యాలయంలో రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ ఆదివారం ఆవిష్కరించారు. ఉత్సవ పోస్టరును ఆవిష్కరించిన పీలా గోవింద, ఉత్సవాలను భక్తులు, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉత్సవాల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలనిఉత్సవ కమిటీ సభ్యులు యువకులకు సూచించారు.

సమిష్టిగా ఉంటేనే సమస్యల పరిష్కారం

బాబూరావును సత్కరిస్తున్న యాదవ సంఘంనాయకులు

ప్రజాశక్తి -అనకాపల్లి : యాదవులంతా ఐకమత్యంగా ఉండడం ద్వారా సమస్యలు పరిష్కరించుకోవచ్చని జిల్లా యాదవ సంఘం అధ్యక్షులు బర్నికాన బాబూరావు అన్నారు. ఆదివారం అనకాపల్లి మండలం బొజ్జన్నకొండ వద్ద యాదవ సంఘం ఆత్మీయ సమావేశం సంఘం అనకాపల్లి మండల అధ్యక్షులు పంచదార్ల కన్నారావు అధ్యక్షతన జరిగింది.

యాదవ సంఘం భవనానికి కృషి చేయాలని సూచించారు. యాదవులంతా సమిష్టింగా ఉంటే, సమస్యలపై ప్రభుత్వంతో పోరాడి పరిష్కరించుకోవడానికి ఆస్కారం ఉంటుందన్నారు.ఈ సందర్భంగా ఆయనను యాదవ సంఘం నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కరక సోమునాయుడు, కసింకోట మండల అధ్యక్షులు కరక రాజు, వియ్యపు సింహాచలం, అయితా రాము, మువ్వల రాము నంబారు రమణ, బంధం చిన్న, వియ్యపు నూకరాజు, వాయిబోయిన ఈశ్వరరావు, యాదవులు తదితరులు పాల్గొన్నారు.

వర్షాలతో రహదారులు ఛిద్రం

- భారీ గోతుల్లో చేరిన నీరు
- రాకపోకలకు వాహనదారుల అవస్థలు

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట :మండలంలోని వడ్డాది రావికమతం మధ్య రోడ్డు పెద్ద గోతులతో వాహనదారులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్డుపై ఉన్న భారీ గోతుల్లో నీరు చేరడంతో ఎక్కడ ఎంత పెద్దగొయ్యి ఉందో తెలియని పరిస్థితుల్లో ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు ఇబ్బందులకు గురౌతున్నారు. కొంతకాలంగా ఈ రోడ్డు మరమ్మతులు, నిర్వహణ చేపట్టకపోవడంతో రోడ్డంతా పూర్తిగా ఛిద్రమైంది. అలాగే సింగవరం, పొట్టిదొరపాలెం, బుదిరెడ్డిపాలెం జంక్షన్‌లలో 200 మీటర్ల పొడవునా రహదారి ఆనవాలు లేనంతగా పాడై, బిటి రోడ్డు కాస్తా మట్టిరోడ్డును తలపించడంతోపాటు ఆయా గోతుల్లో వర్షపునీరు చేయడంతో రాకపోకల కష్టాలు మరింత ఎక్కువయ్యాయని, వాహనదారులు, పాదచారులు

బిఎన్ రోడ్‌లో సింగవరం వద్ద రోడ్డుపై చేరిన నీరు

ఆవేదన చెందుతున్నారు. రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తుందని ప్రభుత్వం ప్రకటించి, తగు చర్యలు చేపడుతున్న నేపథ్యలో బిఎన్‌రోడ్డు అధ్వానస్థితిపై అధికారులు, నేతలు దృష్టిసారించి, వెంటనే రోడ్డు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

బాలికల అక్రమ రవాణాపై నివేదించండి

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ :విశాఖ రైల్వేస్టేషన్ మీదుగా అనుమానాస్పదంగా వేరే ప్రాంతానికి తీసుకువెళ్తున్న తొమ్మిది మంది బాలికలను రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్న వ్యవహారంలో పూర్తి సమాచారంతో రైల్వే పోలీసులు నివేదిక అందించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం ఆదేశించారు. ఆదివారం మీడియాతో మాట్లాడుతూ పిల్లల అక్రమ రవాణా జరుపుతున్నారా, ఉపాధి పనులు కల్పించే నిమిత్తమా అన్నదానిపై సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో వివిధ కోణాల్లో దర్యాప్తు చేపట్టి నివేదిక అందజేయాలన్నారు .ఈ నివేదిక ఆధారంగా కమిషన్ చైర్ పర్సన్ కేసలి అప్పారావు నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వానికి వివిధ సిఫారసులు చేయనున్నట్టు సీతారాం తెలిపారు.

జనసేనలోకి గోవిందపాలెం వైసిపి నేతలు

జనసేనలో చేరిన వారితో ఎమ్మెల్యే సుందరపు

ప్రజాశక్తి -అచ్యుతాపురం :మండలంలోని గోవిందపాలేనికి చెందిన వైసిపి నేతలు, కార్యకర్తలు 70మంది ఆదివార స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ సమక్షంలో జనసేనలోకి చేరారు. అచ్యుతాపురంలో ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ స్వగృహం వద్ద వారికి జనసేన పార్టీ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఎమ్మెల్యే స్వాగతం పలికారు. గ్రామ మాజీ సర్పంచ్ కిలాడి అప్పలరాజు, వార్డు సభ్యులు, 70 మంది కార్యకర్తలు జనసేనలో చేరిన వారిలో ఉన్నారు. కార్యక్రమంలో పప్పల నూకన్న దొర, నరసింహారావు రాజు, బి రామదాసు పాల్గొన్నారు.

ప్రజల వద్దకే ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

ప్రజాశక్తి- అనకాపల్లి : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మరింత సమర్థవంతంగా అమలు చేసే క్రమంలో ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా జిల్లాలోని అన్ని మండల తహసీల్దార్, మున్సిపల్ కార్యాలయాలలో ప్రజా ఫిర్యాదులు స్వీకరణకు ఏర్పాట్లు చేసినట్లు జిల్లా రెవిన్యూ అధికారి వై. సత్యనారాయణ రావు తెలిపారు. మండల కేంద్రాలలో తహశీల్దార్, మండల పరిషత్ కార్యాలయాల్లో ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తారని, ప్రజలు అక్కడికే వెళ్లి తమ సమస్యపై దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. ప్రతి సోమవారం ప్రజలు తమ సమస్యల పరిష్కారం కొరకు సమీప మండల కార్యాలయాలు లేదా మునిసిపల్ కార్యాలయాలలో ఫిర్యాదులను సమర్పించాలని జిల్లా రెవెన్యూ అధికారి తెలిపారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి- అనకాపల్లి : మండలంలోని తుమ్మపాల గ్రామంలో కొత్తపేట వీధి, నాయీ బ్రాహ్మణుల వీధిలో సిసి రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులకు ఆదివారం స్థానిక నేతలు శంకుస్థాపన చేశారు. స్థానిక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ చొరవతో ఆయా వీధులకు సిసి డ్రైనేజీ, రోడ్లకు నిధులు మంజూరయ్యాయని కూటమి నేతలు వెల్లడించారు.కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మత్తుర్తి ఉమామహేశ్వరరావు, తెలుగు యువత అధ్యక్షులు సందిన సునీల్, బొడ్డపాటి రామ్ కుమార్, మంత్రి సత్యనారాయణ, శొంట్యాన నాగేశ్వరరావు, బొడ్డపాటి వెంకట సూరి,బొడ్డపాటి రాజారావు, చదరం నాగేశ్వరరావు,సర్పంచ్ తట్టా పెంటయ్య నాయుడు శంకుస్థాపనలో పాల్గొనగా, కూటమిపార్టీల నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఆదినారాయణ మహిళా కాలేజీ పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి- అనకాపల్లి : పట్టణంలోని ఆదినారాయణ మహిళా కళాశాలలో 1988-93 బ్యాచ్‌ల ఇంటర్, బిఎ ఆర్ట్స్ గ్రూపు విద్యార్థినులు 32 సంవత్సరాల తర్వాత ఆదివారం అనకాపల్లి గవరపాలెం గౌరీ సేవా సంఘం మల్ల జగన్నాథం కళ్యాణ మండపంలో కలిశారు. బెంగళూరు, హైదరాబాద్, విశాఖపట్నం, శ్రీకాకుళం వంటి తదితర సుదూర ప్రాంతాల నుండి అనకాపల్లి చేరుకున్న పూర్వ విద్యార్థులంతా ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకొని, పరస్పర యోగక్షేమాలు తెలుసుకుని, నాటి పాత జ్ఞాపకాలను స్మరించుకుంటూ రోజంతా ఆనందంగా గడిపారు.

తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఆదినారాయణ మహిళా కళాశాల అధ్యాపకులు ఇందిర, రత్నమాల, కనకదుర్గ, పద్మకుమారి, కమల, వెంకటలక్ష్మి, విజయలను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు చూపిన అభిమానం పట్ల అధ్యాపకులు ఉక్కిరిబిక్కిరయ్యారు. పూర్వ విద్యార్థులు కాండ్రేగుల శ్రీలక్ష్మి, కొణతాల జ్యోతి, కర్రి పద్మావతి, బుద్ధ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో సాయంత్రం వరకు ఆటపాటలతో కాలక్షేపం చేశారు. కార్యక్రమంలో విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే పెతకంశెట్టి గణబాబు సతీమణి మాధవీలత పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని అంతకాపల్లి శివారు రావులమ్మపాలెంలో జెడ్‌పి హైస్కూల్ 1993-94 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం అడ్డూరు మజ్జిగైరమ్మ గుడి ఆవరణలో కలుసుకున్నారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. 30 ఏళ్ల క్రితం చదువుకుని, ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతాకలుసుకున్నారు. చిన్ననాటి మధుర జ్ఞాపకాలను అల్లరి చేష్టలను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. అనంతరం విందు, వినోదాలను పంచుకున్నారు. గ్రూపులుగా ఫోటోలు దిగి సందడి చేశారు. ఈ సందర్భంగా తమ బ్యాచ్‌లోని మిత్రులకు ఎవరికైనా కష్టం వస్తే అందరం కలిసి ఆర్థికంగా, అన్ని విధాలా ఆదుకోవాలని నిర్ణఇయంచారు. సహఫంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో అంతకపల్లి గ్రామ ఉపసర్పంచ్ గొర్లి అప్పారావు, మిడతాడ ఈశ్వరరావు ,చిటిమిరెడ్డి అప్పారావు ,చిటిమిరెడ్డి నాయుడు, కే. రాజు, చొక్కాకుల దేవుడు బాబు ,రొంగలి బుచ్చంనాయుడు, అనకాపల్లి సోంబాబు కోటాన ఆనంద్, నలిగిరి అప్పలరాజు, భాగ్యవతి, దేముడమ్మా పాల్గొన్నారు

రావులమ్మపాలెం జెడ్‌పి హైస్కూల్ పూర్వవిద్యార్థులు

ఉచిత వైద్యసేవలను వినియోగించుకోండి

ప్రజాశక్తి- కె. కోటపాడు : సంగివలస అనిల్ నీరుకొండ ఆసుపత్రిలో అన్ని రకాల వ్యాధులకు ఉచితంగా ఆపరేషన్లు, ఇతర చికిత్సలు నిర్వహిస్తారని, అవసరమైనవారు సద్వినియోగం చేసుకోవాలని కస్పా జగన్నాధపురం కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయ వ్యవస్థాపకులు, బిఆర్‌ఎస్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు. రాపేటి రామకొండలరావు మాస్టారు తెలిపారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ గుండె సమస్యలు. గుండెలో స్టంటులు. చెవి. ముక్కు. గొంతు. కిడ్నీ సమస్యలు. మూల వ్యాధి, నడుము, కాళ్లు, చేతులకు వేసిన రాడ్లు తొలగింపు, కడుపులో కాయలు, హైడ్రోసెల్. తదితర వ్యాధులకు పరీక్షలు నిర్వహించి అవసరం మగవారికి ఉచితంగా ఆపరేషన్ చేస్తారన్నారు. ఆయా సమస్యలతో బాధపడుతున్న వారు ఈనెల 25న ఉదయం ఏడు గంటలకు కె.కోటపాడు నుంచి ఆసుపత్రికి రోగులను తీసుకెళ్లేందుకు పెనగాడి మీదుగా తగరపువలసకు బస్సు బయలుదేరుతుందన్నారు. మరిన్ని వివరాలకు ఆర్ కొండలరావు మాస్టారు 988.5650716, కె. కోటపాడు సూరిశెట్టి నారాయణ 9441026572, దార్ల శివ గున్నాచారులను సంప్రదించాలన్నారు.

గుండెపోటుతో సర్పంచ్ భర్త మృతి

ప్రజాశక్తి- కె.కోటపాడు: మండలంలోని గుండు పాలెం గ్రామానికి చెందిన తెలుగుదేశం యువ నాయకుడు బండారు లక్ష్మణరావు ఆదివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందాడు. లక్ష్మణరావు సతీమణి కనకమల్లేశ్వరి గ్రామ సర్పంచ్‌గా వ్యవహరిస్తున్నారు. గ్రామంలో మంచి సౌమ్యుడుగా పేరున్న లక్ష్మణరావు ఆకస్మిక మరణంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతదేహాన్ని స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, తెలుగుదేశం నాయకులు, పలువురు సర్పంచులు, ఎంపిటిసిలు పరామర్శించి, నివాళులర్పించారు. మృతుని కుటుంబానికి సంతాపం తెలిపారు.

దీపపు కుందెల వితరణ

ప్రజాశక్తి -మునగపాక: మండలంలోని తిమ్మరాజుపేట నూకాంబిక ఆలయానికి గ్రామస్తుడు, ప్రస్తుత భీమవరం ద్వామా పీడీగా విధులు నిర్వహిస్తున్న శరగడం తారక వెంకటరాజేశ్వరరావు దంపతులు ఆదివారం దీపపు కుందెలు వితరణ చేశారు. తన తండ్రి మాజీ సర్పంచ్ వెంకటరమణ జ్ఞాపకార్థం రూ .15 వేలు విలువగల దీపపు కుందెలను దేవాలయ కమిటీకి వితరణగా అందజేసినట్లుగా రాజేశ్వరరావు తెలిపారు.. కార్యక్రమంలో రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనివాసరావు, గ్రామ ఉపసర్పంచ్ కాండ్రేగుల జగన్, మల్ల స్వామి చంద్రనాయుడు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

బాల వికాస్ గురువులకు శిక్షణ

ప్రజాశక్తి- దేవరాపల్లి : సత్యసాయి సేవా సంస్థల అనకాపల్లి జిల్లా విద్యా విభాగం ఆధ్వర్యంలో కె.కోటపాడు, దేవరాపల్లి మండలాల బాలవికాస్ గురువులకు ఆదివారం కాశీపురం ఉన్నత పాఠశాలలో శిక్షణ నిర్వహించారు. విశాఖపట్నం విద్యా విభాగ సమన్వయకర్త మల్లాది జయ, ఫ్యాకల్టీ ప్రశాంతి, పద్మజ పాల్గొని, గురువులు ఎలా ఉండాలి , పిల్లలకు ఎలా బోధించాలని తదితర ఐదు అంశాలపై శిక్షణనిచ్చారు. అనకాపల్లి జిల్లా విద్యా విభాగ సమన్వయకర్త శక్తి మూర్తి, స్వామి నాయుడు ఆధ్వర్యంలో మండల ఇన్చార్జి ఆదిరెడ్డి చిన కన్నబాబు నిర్వహణలో సుమారు 30 మంది గురువులు శిక్షణలో పాల్గొన్నారు. జిల్లా అధ్యక్షులు కసిరెడ్డి అప్పలనాయుడు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి -అచ్యుతాపురం : ఎర్రవరం గ్రామంలో కనకదుర్గ అమ్మవారి ఆలయంలో ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ ఆదివారం ప్రత్యేకమైన పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి సభ్యుడు జనపరెడ్డి శ్రీనివాసరావు, ద్వారపురెడ్డి బాబ్జి, బి రామదాసు, గుడేల కనకారావు, అగ్గాల హనుమంతరావు, పైలా రామ్ నాయుడు, కాండ్రేగుల సూర్యనారాయణ కే జోగినాయుడు, టెక్కలి పరశు రాము పాల్గొన్నారు.

పట్టు వస్త్రాలను సమర్పిస్తున్న ఎమ్మెల్యే సుందరపు

ఆలోచింపజేస్తున్న ఆహ్వాన నాటికలు

- ఉత్సాహభరితంగా ఉభయ రాష్ట్రాల ఆహ్వాన నాటకోత్సవాలు

ప్రజాశక్తి -అనకాపల్లి : స్థానిక జార్జి క్లబ్‌లో కళావి పంచి హైదరాబాద్, తెలుగు డ్రామా హైదరాబాద్ , జార్జ్ క్లబ్, సంయుక్త నిర్వహణలో ప్రదర్శిస్తున్న నాటికలు ప్రేక్షకులను ఆలోచింపజేస్తున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం మొదటి ప్రదర్శన సహృదయ ద్రోణాదుల, చిలకలూరిపేట వారి 'వర్క్ ఫ్రం హోం' హాస్య నాటిక, తర్వాత 'మా ఇంట్లో మహాభారతం' నాటికలు ప్రదర్శించారు.

వర్క్ ఫ్రం హోం నాటిక ఇతివృత్తం సంగ్రహంగా.. సుధీర్ సాఫ్ట్వేర్ ఉద్యోగి, వంటల్లోనూ నిష్ణాతుడు. వంట చేయడం అంటే ఆసక్తి లేని సౌమ్యను వివాహం చేసుకుంటాడు. వర్క్ ఫ్రం హోం కు పర్మిషన్ తీసుకొని ఒకపక్క వంట చేస్తూనే మరోవైపు ఉద్యోగం నిర్వహిస్తాడు. తన భర్త చేసే వంటల ప్రావీణ్యతను భార్య సౌమ్య బంధువులకు చేరవేస్తుంది. దీంతో బంధువుల రాకపోకలు పెరగడంతో సుధీర్‌కు వంట బాధ్యత భారం కూడా పెరుగుతుంది. దీంతో చేసేదిలేక సాఫ్ట్వేర్ ఉద్యోగానికి రిజైన్ చేసి సౌమ్య లక్ష్మి హోమ్ ఫుడ్స్ పేరుతో స్టార్టప్ ప్రారంభిస్తాడు. ఆద్యంతం చక్కని హాస్య సన్నివేశాలతో ప్రేక్షకులను అలరించింది.

అలాగే రెండోనాటికగా మా ఇంట్లో మహాభారతం నాటిక కథాంశాన్ని పరిశీలిస్తే రామచంద్రరావు అన్నపూర్ణమ్మ లకు ఉద్యోగం లేని 36 ఏళ్ల ఏకైక పుత్రుడు వాసు.40 ఎకరాల భూమి ఉన్నా, ఉద్యోగం లేని వాసుకు ఎవరూ పిల్లల్ని ఇవ్వరు. విలాసాల పురుషుడైన రామచంద్రరావు పొలాన్ని ఎక్కడ పాడు చేస్తాడని తలచి తన కొడుకు పేర భూమిని రాయిస్తుంది. రామచంద్రరావు స్నేహితుడు పెళ్లిళ్ల పేరయ్య రెండు అపార్ట్మెంట్లు, ఐదు ఎకరాల మామిడి తోట ఉందని నమ్మించి నవీన అనే అమ్మాయితో వివాహం జరిపిస్తారు. అనంతరం విషయం తెలిసిన రామచంద్రరావు ఆమెను ఇంటి నుంచి బయటకు పంపేందుకు ప్రయత్నించగా తాను గిరిజన మహిళనని చట్టాలు తెలుసునని భయపిస్తుంది. ఇంతలో అప్పులు పెరగడంతో తన కుటుంబ అప్పులను సొంతూరులో ఉన్న స్థలాన్ని అమ్మి ఆ డబ్బుతో అప్పులు తీర్చేందుకు ప్రయత్నిస్తుంది. ఆమె మంచితనాన్ని గ్రహించిన అత్తమామలు ఆమె గర్భవతి అని తెలుసుకుని పుట్టే బిడ్డను డాక్టరు లేదా ఇంజనీర్ను చేద్దామని చెబుతారు. అయితే తన బిడ్డను దేశానికి అన్నం పెట్టే అన్నదాతను చేస్తానని చెప్పడమే ఈ కథ సంగ్రహం. రెండు నాటికల్లోనూ నటీనటులు పాత్రోచితంగా అద్భుత ప్రతిభను కనబరిచారు.

వర్క్ ఫ్రం హోం లో ఒక హాస్య సన్నివేశం.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయి చెల్లించాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ :పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్‌సిప్ బకాయిలు రూ.3580 కోట్లు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జి. ఫణీంద్ర కుమార్, జిల్లా కార్యదర్శి యు.నాగరాజు మాట్లాడుతూ ప్రైవేట్ కళాశాలల పిజి విద్యార్థులకు శాపంగా మారిన జీవో నెంబర్ 77 రద్దు చెయ్యాలన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ సంక్షేమ హాస్టల్లో పెండింగ్‌లో ఉన్న మెస్ బిల్లులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. యువగళం పాదయాత్రలో విద్యార్థులకు మోసపూరిత హామీలు ఇచ్చి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని విమర్శించారు.ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రైవేట్ కళాశాలల్లో పిజి చదువుతున్న విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక చదువు మధ్యలోనే ఆపేసే పరిస్థితి దాపురించిందని, తాము అధికారంలోకి రాగానే జిఒ 77 రద్దుచేసి పిజి విద్యార్థులకు ఉపశమనం కలిగిస్తామని హామీ ఇచ్చిన లోకేష్ నేడు అధికారంలోకి వచ్చి పూర్తిగా విద్యార్థుల్ని మోసం చేస్తున్నారని విమర్శించారు .లోకేష్ రెడ్‌బుక్‌లో విద్యార్థుల సమస్యలు పొందుపరచలేదని, కేవలం ప్రతిపక్ష నాయకులపై కక్ష సాధింపుల విషయాలను మాత్రమే పొందుపరిచారని ఎద్దేవా చేశారు. ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా విద్యార్థుల సమస్యలు మాత్రం పరిష్కారం కావటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని లేని పక్షంలో సిఎం క్యాంప్ ఆఫీస్ ముట్టడిస్తామని హెచ్చరించారు.కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు పి.శేఖర్, ఆంధ్ర యూనివర్సిటీ కార్యదర్శి జె.అభిషేక్, జిల్లా నాయకులు మౌనిక,శివరాజ్ కుమార్, నెహేమియ,కిరణ్,హరి, పవన్ కళ్యాణ్, ఆదర్శ,అభి,గణేష్ పాల్గొన్నారు.

సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలి

ఆలయం వద్ద నోటీసులు అంటిస్తున్న ఎస్ఐ శ్రీనివాసరావు

ప్రజాశక్తి - బుచ్చెయ్యపేట : ఇటీవల కాలంలో గుడులు, ఇళ్లల్లో చోరీలు పెరుగుతున్న నేపథ్యంలో గ్రామాల్లో ఆలయాలు, ముఖ్య కూడళ్ల వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని బుచ్చెయ్యపేట ఎస్ఐ ఎ.శ్రీనివాసరావు సూచించారు. ఆదివారం మండలంలోని దిబిడి, బుచ్చెయ్యపేట తదితర గ్రామాల్లో ఆలయాల వద్ద, జంక్షన్లలోనూ సిసి కెమెరాల ఏర్పాటుపై ప్రజల్లో అవగాహనకు నోటీసులు అంటించారు. ఇటీవల మండలంలో కొన్ని గ్రామాల్లో దొంగతనాలు విరివిగా జరుగుతుండడంతో ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సిసి కెమెరాల ఏర్పాటుతో చోరీ కేసులు, ఇతర అసాంఘిక చర్యల్లో నిందితులను పట్టుకోడానికి అవకాశం ఉంటుందన్నారు. గ్రామాల్లో అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

గోస్పల్ చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి- అనకాపల్లి : పట్టణంలోని గాంధీనగరం ఫుల్ గోస్పెల్ చర్చ్‌లో ఆదివారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ క్రీస్తు చూపించిన మార్గం అనుసరణీయమని, ప్రతిఒక్కరూ జాలి, దయ, ప్రేమ కలిగి ఉండాలని ఆకాంక్షించారు. క్రీస్తు మార్గంలోని ప్రశాంతతను కొనియాడుతూ, గోల్డ్ వాసు ఆర్థిక సహాయంతో చీరలు పంపిణీ చేపట్టారు. పాస్టర్ చంద్రశేఖర్, విక్టోరియా మేరీ గ్రీన్, గొర్లి సువర్ణ రాణి, రవితేజ, రియాజ్, భానుచంద్ర పాల్గొన్నారు.

పలుచోట్ల గణిత దినోత్సవం

ప్రజాశక్తి -చోడవరం : ప్రభుత్వ డిగ్రీ కళాశాల గణిత విభాగం ఆధ్వర్యంలో శ్రీనివాస రామానుజన్ జయంతి, గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. రామానుజన్ చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి కిరణ్ కుమార్, హెచ్ ఓ డి డాక్టర్ కృష్ణారావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రామానుజన్ ప్రతిభను కొనియాడారు. కార్యక్రమంలో. డాక్టర్ కృష్ణారావు, జువాలజీ హెచ్ఒడి డాక్టర్ రత్నభారతి, ఫిజిక్స్ హెచ్ఒడి సుధీర్, కెమిస్ట్రీ హెచ్ఒడి జి వెంకటేష్ ,సీనియర్ అధ్యాపకులు ఎస్ఎం రాపుద్దీన్, డి మాల్యాద్రి, ఎకనామిక్స్ హెచ్ఒడి డాక్టర్ రాధాకృష్ణ, కామర్స్ హెచ్ఒడి వి అప్పలనాయుడు, డాక్టర్ లక్ష్మీ మంగమ్మ, డాక్టర్ జ్యోతి, డాక్టర్ సూర్యవతి, డాక్టర్ మల్లిబాబు, పిచ్చమ్మ, డాక్టర్ నారాయణ మూర్తి, సరస్వతి, రామలక్ష్మి, కోమల, పిడి మూర్తి, బోటనీ తాతారావు, కెమిస్ట్రీ సంతోష్, కంప్యూటర్ రాజేష్, కామర్స్ శ్రీనివాసరావు పాల్గొన్నారు. విద్యార్థులకు పెన్నులు బహూకరించారు.

అనకాపల్లి :స్థానిక డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైకుంఠరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస రామానుజన్ జీవిత చరిత్రపై సమాచారం కలిగిన ప్రసంగాలు, రామానుజన్ సంఖ్యా సిద్ధాంతంపై చేసిన వివిధ సమీకరణాలు చూపించే పోస్టర్లను విద్యార్థులు రూపొందించి ప్రదర్శించారు బేసిక్ సైన్స్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భీమునిపట్నం : గణిత శాస్త్ర మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతిని ఆదివారం భీమిలిలో నిర్వహించారు. ఆదర్శ హిందీ ప్రేమీ మండలి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆదర్శ ప్రేమీ మండలి అధ్యక్షులు కెఎస్ఆర్.కృష్ణారావు, గౌరవాధ్యక్షులు గంటా నూకరాజు మాట్లాడుతూ, శ్రీనివాస రామానుజన్ గణిత శాస్త్రంలో ప్రపంచ దేశాలకు గొప్ప విజ్ఞానాన్ని అందించారని కొనియాడారు. అనంతరం ఆయన జీవిత విశేషాలపై విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు గండిబోయిన పోలిరాజు, రాజగిరి రమణ తదితరులు పాల్గొన్నారు.

డైట్ కళాశాలలో సమీకరణాల పోస్టర్ తయారుచేసిన విద్యార్థిని

నర్సీపట్నం టౌన్: స్థానిక శాఖా గ్రంథాలయంలో గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని లైబ్రేరియన్ దమయంతి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా చదవడం మాకిష్టం కార్యక్రమానికి వచ్చిన విద్యార్థిని విద్యార్థులకు రామానుజన్ గురించి వివరించారు. రిసోర్స్ పర్సన్ ఆర్ సతీబాబు విద్యార్థులకు గణితంలో మెలకువలను వివరించారు. లెక్కలు చేయడంలో సులువు పద్ధతులు వివరించారు. విద్యార్థులతో కూడికలు, బాగాహారాలు, గుణకారాలు, తీసివేతలు లెక్కలు చేయించారు. విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు పి ప్రభాకర్ రామానుజన్ గొప్పతనాన్ని విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంచారు.

నత్తనడకన రోడ్డు నిర్మాణ పనులు

ప్రజాశక్తి -రావికమతం:తారు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయినప్పటికీ నత్తనడకన పనులు సాగుతున్నాయి. సుమారు 2 నెలల క్రితం ఈ రోడ్డు పనులు ప్రారంభించినా ముందుకు సాగడం లేదు.

మండలంలో చినపాచీల చెరుకు కాటా దగ్గర నుంచి టి.అర్జాపురం మెయిన్ రోడ్డు వరకు 14 కిలో మీటర్ల మేర తారు రోడ్డు నిర్మాణంకు 7 కోట్ల 60 లక్షల నాబార్డ్ నిధులు మంజూరయ్యాయి. ఈ రోడ్డు పూర్తిగా శిథిలావస్థకు చేరుకొని, గుంతల, గుంతలగా ఏర్పడటంతో ఈ రోడ్డుపై వెళ్లాలంటే ప్రజలు నరకం చూడాల్సిందే. నిత్యం గిరిజన ప్రాంత ప్రజలు ఇదే రోడ్డు నుంచి తరచూ ప్రయాణాలు సాగిస్తుంటారు.

మండల కేంద్రానికి రావాలన్నా, జిల్లా కేంద్రానికి వెళ్లాలనుకున్నా ఈ రోడ్డు గుండానే వెళ్లాలి. చదువుకుంటున్న విద్యార్థులు సైతం పాఠశాలలకు వెళ్లాలంటే నడుచుకొని, లేదంటే సైకిల్ పైన వెళుతుంటారు. దీంతో, విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చినుకు పడితే చాలు చిత్తడి చిత్తడిగా రోడ్డు మారి గోతులలో నిండిపోతుంది. దీంతో గొయ్యి ఎక్కడ ఉందో తెలియని పరిస్థితి నెలకొంది. పాదచారులు, బైకిస్టులు ప్రయాణాలు చేస్తున్నప్పుడు అనేక ప్రమాదాలకు గురవుతున్నారు.

ఈ రహదారి గుండా కేబీపీ అగ్రహారం, కవగుంట, కొమిరా , చినపాచిల, గుమ్మాలపాడు, ఎర్రబంద, కొత్త కోట్నాపల్లి, పాత కొట్నాపల్లి, గడబపాలెం, సీత బంధల, అవరువాడ, తిరువాడ, వీరనారాయనం, తమ్మవాని పాలెం, చేరాడ, ఆర్.కొత్తూరు, చిలకవానిపాలెం, దొండపూడి, కిత్తంపేట, మచ్చవానిపాలెం, తదితర ప్రాంతాల ప్రజలు ఇదే రోడ్డు గుండా ప్రయాణాలు సాగిస్తుంటారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఈ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసినప్పటికీ పనులు మాత్రం నత్తనడకన సాగుతున్నాయి.

చోడవరం శాసనసభ్యులు కేఎస్ఎన్ఎస్ రాజు, మండల పార్టీ అధ్యక్షుడు రాజానకొండ నాయుడు ప్రత్యేక దృష్టి సారించి ఈ రోడ్డు నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. దీంతో రోడ్డుపై నల్ల మెటల్, రోలింగ్ వంటి పనులు సాగుతున్నాయి. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా పనులు నత్తనడకన సాగుతున్నాయి.

రోడ్డుపై వేసిన నల్ల మెటల్

ఈ విషయమై పంచాయతీరాజ్ ఏఈ ఈ శ్రీనివాసరావును వివరణ కోరగా ప్రస్తుతం రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయని, మొదట 4.5 కిలోమీటర్లు వేసి తదుపరి బిట్లు, బిట్లుబుగా పూర్తి చేయడం జరుగుతుందన్నారు. రోడ్డు నిర్మాణం పనులు మార్చి నెలాఖరు నాటికి పూర్తి అవుతుందని ఆయన తెలిపారు.

నివాళి అర్పిస్తున్న నాయకులు

ఘనంగా నూకినాయుడు వర్ధంతి

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని కృష్ణదేవిపేటలో కామ్రేడ్ లగుడు నూకినాయుడు 27వ వర్ధంతిని ఆదివారం సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్థూపం వద్ద నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ సీనియర్ నాయకులు మేకా సత్యనారాయణ మాట్లాడుతూ కామ్రేడ్ నూకినాయుడు ప్రాణాలను సైతం లెక్క చేయకుండా నిరంతరం ప్రజల్లో ఉండి ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేశారన్నారు.ప్రజా సేవకు అంకితమైన కమ్యూనిస్టుడు కామ్రేడ్ నూకినాయుడు అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి మేకా భాస్కరరావు, జి.రాధాకృష్ణ, సాపిరెడ్డి బాబ్జి, లగుడు శ్రీనివాసరావు, గల్లా సన్యాసిరావు, పందిరి రాజబాబు, దాసరి రాము, రమేష్, బాబురావు పాల్గొన్నారు.

చోరీలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి -రావికమతం:సంక్రాంతి పండగ సమీపిస్తున్న తరుణంలో ప్రజలు చోరీలపై అప్రమత్తంగా ఉండాలని రావికమతం ఎస్ఐ రఘువర్మ తెలిపారు. పండగలకు సొంత గ్రామాలకు వెళ్తున్న తరుణంలో ఇళ్లకు తాళాలు వేసి పోలీసులకు ముందస్తు సమాచారం అందించాలని ఆయన తెలిపారు. ఆ ఇళ్ల పైన ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. గ్రామాలలో చోరీలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు.మద్యం సేవించి వాహనాలు నడపడంతో పలు ప్రమాదాలు చోటు చేసుకుంటాయన్నారు. రోడ్డు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టరీత్యా తగు చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

ఎస్ఐ రఘువర్మ

నీటితో తడుస్తున్న వరి పనలు

అకాల వర్షంతో తడిసి ముద్దయిన వరి పంట

ప్రజాశక్తి -నక్కపల్లి: అకాల వర్షం అన్నదాతకు అపార నష్టం మిగిల్చింది. అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షానికి పొలాల్లో ఉన్న కోసిన వరి పనలు తడిసి ముద్దయ్యాయి. కోత దశకు చేరుకున్న వరి అక్కడక్కడ నేల కొరిగింది. దీంతో రైతన్నకు అపార నష్టం జరిగింది. వర్షానికి భయపడి కోసిన వరి ఎండకుండానే పలుచోట్ల రైతులు వరి కుప్పలు వేశారు. వరి పొలాల్లో తడిసి పోయిన వరి పనలను రైతులు ఆరబెట్టే ప్రయత్నం చేస్తున్నారు. రైతులకు కూలీల కొరత వేధిస్తుంది. అందరికీ ఒకేసారి కూలీలు అవసరం కావడంతో, కూలీలకు డిమాండ్ ఏర్పడింది. మండలంలో ఈ ఏడాది 4400 ఎకరాల్లో వరి సాగు సాగింది. వరి ఆశాజనకంగా ఉండడంతో రైతులు బాగా దిగుబడి వస్తుందని ఆశించారు. అయితే అకాల వర్షం రైతన్నకు కంటి మీద కునుకు లేకుండా చేసింది. అకాల వర్షం కారణంగా తడిసిన వరి పంటను కాపాడుకునేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. అదనంగా కూలీలను పెట్టుకొని తడిసిన వరి పనలను ఆరబెడుతున్నారు. అకాల వర్షం వల్ల ఒకపక్క పంట నష్టంతో పాటు, మరోపక్క అదనంగా కూలీల భారం పడడంతో రైతులు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. ఇంకా 40 శాతం పైబడి వరి కోతలు అవ్వాల్సి ఉంది. కూలీలు డిమాండ్ ఏర్పడడంతో వరి కోతలు మందకొడిగా సాగుతున్నాయి. రైతులు కూలీల కోసం అన్వేషిస్తున్నారు. కాలం ఎప్పుడు ఎలా ఉంటుందో తెలియని పరిస్థితి ఏర్పడడంతో అన్నదాత ఆందోళన చెందుతున్నారు.

ఘనంగా పివి.రావు వర్ధంతి

ప్రజాశక్తి -మాడుగుల:మాల మహానాడు వ్యవస్థాపకులు పివి రావు వర్ధంతి వేడుకలు ఆదివారం మాల మహానాడు సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ వేడుకల్లో పలువురు మాల మహానాడు సభ్యులు మాట్లాడుతూ, ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో సుప్రీంకోర్టులో కేసు వేసి యావత్ భారతదేశంలో ఎక్కడా లేని వర్గీకరణ కేవలం ఆంధ్రప్రదేశ్లో చెల్లదని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును కాపీ తీసుకోవడానికి ఢిల్లీ వెళ్లి నడివీధిలో పివి రావు అమరులు అయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ మెంబర్ మరువాడ ఈశ్వరరావు, పట్టా ఈశ్వరరావు, పాము సూర్యారావు, దేవుడు, ఎద్దు రమణ, మల్లేటి భీమేష్, వెంకట్రావు, నక్క కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

చదువుతున్న విద్యార్థులు

గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం'

ప్రజాశక్తి-గొలుగొండ:స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి రాజుబాబు ఆధ్వర్యంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ప్రముఖ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం పిల్లలచే పుస్తకాలు చదివించారు.

ఊరేగిస్తున్న భక్తులు

వైభవంగా తిరువీధి సేవ

ప్రజాశక్తి -నక్కపల్లి: ప్రాచీన పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీనివాసుడు పుణ్యకోటి వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. భూదేవి శ్రీదేవి సమేత శ్రీనివాసుని ఉత్సవమూర్తులను పుణ్యకోటి వాహనం పైన, గోదాదేవి అమ్మవారి ఉత్సవమూర్తులను పల్లకిలోను వేయింపజేసి అర్చక బృందం ఆధ్వర్యంలో వైభవంగా తిరువీధి సేవ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వర ప్రసాదాచార్యులు, అర్చకులు కృష్ణమాచార్యులు, శేషాచార్యులు, గోపాలా చార్యుల ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: రాష్ట్ర వ్యవసాయ సహాయకులు అధ్యక్షులు రాంప్రసాద్ ఆధ్వర్యములో అనకాపల్లి జిల్లా వ్యవసాయ సహాయకుల విస్తృతస్థాయి సమావేశం ఆదివారం స్థానిక వాసవి కళ్యాణ మండపంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం ఏర్పాటు అయ్యింది. నూతన కార్యవర్గం అధ్యక్షుడుగా హరీష్ అప్పారావు (అనకాపల్లి), జనరల్ సెక్రటరీగా సత్యారావు(చోడవరం), ట్రెజరర్గా సౌజన్యవాని(పాయకరావుపేట), వర్కింగ్ ప్రెసిడెంట్గా అప్పలనాయుడు(చోడవరం), ఉపాధ్యక్షుడుగా రాకేష్ (పాయకరావుపేట), జాయింట్ సెక్రటరీగా గౌరినాయుడు (నర్సీపట్నం), ఆర్గనైజింగ్ సెక్రటరీగా మహేష్ (పాయకరావుపేట), మహిళా కార్యదర్శులుగా ప్రియాంక (పాయకరావుపేట), మౌళ్య (అనకాపల్లి) ఈసీ మెంబెర్స్ గా జ్యోతీమోహన్, జ్యోతి, హరీష్, అనురాధ, శ్రావణ్‌లను ఎన్నుకున్నారు.

ప్రజల పత్రిక ప్రజాశక్తి

-ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

ప్రజాశక్తి- అరకు లోయ :ప్రజాశక్తి దినపత్రిక ప్రతి ఏడాది ప్రచురిస్తున్న మల్టీకలర్ క్యాలెండర్ అద్భుతంగా ఉందని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అన్నారు. ప్రజాశక్తి ప్రచురించిన 2025 క్యాలెండర్‌తో పాటు, డైరీలను ఆదివారం ఉదయం తన గృహములోని తన కార్యాలయం ఛాంబర్‌లో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజా సమస్యలపై నిక్కచ్చిగా వార్తలు రాస్తూ ప్రజల మన్ననలు పొందుతుందన్నారు. ప్రతి అక్షరం ప్రజల పక్షం నినాదంతో ప్రజాశక్తి దినపత్రిక విజయవంతంగా ప్రజల గొంతును వినిపిస్తుందని అన్నారు. ప్రజాశక్తి దినపత్రిక మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఆదివాసి గిరిజన సంఘం అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్, జిల్లా వైసీపీ బీసీ సెల్ అధ్యక్షుడు గెడ్డం నరసింగరావు, అరకు వైసీపీ సోషల్ మీడియా అధ్యక్షులు పాంగి నరసింగరావు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రేగం చాణక్య, సెగని నాగరాజు, రామారావు పాల్గొన్నారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

పాడి రైతుల సంక్షేమానికి విశాఖ డెయిరీ కృషి

ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి


చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే బండారు, డెయిరీ చైర్మన్ ఆనంద్‌కుమార్

ప్రజాశక్తి- మాడుగుల:సంక్రాంతి పండుగ కానుకగా విశాఖ డెయిరీ రైతులకు బోనస్ అందిస్తుందని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని తులసి కళ్యాణ మండపం వద్ద 2025 సంక్రాంతి పండగ సందర్భంగా బోనస్ నగదు చెక్కులను విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్, డైరెక్టర్ పిల్ల రమాకుమారి ఆధ్వర్యంలో శాసనసభ్యులు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ, విశాఖ డైరీ వ్యవస్థాపకులు ఆడారి తులసిరావు ఎప్పుడు రైతులు మేలు కోసం ఎన్నో కార్యక్రమాలు ఏర్పాటు చేశారని కొనియాడారు. రైతుల సంక్షేమమే డెయిరీ లక్ష్యంగా ముందుకు నడిపారన్నారు. ఆయన బాటలోనే ఆనంద్ కుమార్, రమాకుమారి డైరెక్టర్లు పనిచేస్తున్నారని అన్నారు. డెయిరీ చైర్మన్ ఆనంద్ కుమార్ మాట్లాడుతూ రైతులకు 2025కి సంబంధించి రెండు బోనస్ లు ఇస్తున్నామన్నారు. ఉగాది నాటికి మరో బోనస్ ఇచ్చే ఆలోచన చేస్తున్నామన్నారు. డెయిరీలో వస్తున్న లాభాలను రైతులకు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు సీరం రెడ్డి సూర్యనారాయణ, గేదెల సత్యనారాయణ, సుందరపు గంగాధర్, మాజీ ఎంపీపీ పుప్పాల అప్పలరాజు, మాజీ సర్పంచ్ సూర్యారావు, డైరీ జనరల్ మేనేజర్ కుమార్, డిప్యూటీ మేనేజర్ పి పాండ్యా రాజన్, మేనేజర్ జి రాము, స్థానిక విశాఖ డైరీ అధ్యక్షులు పాము శీను, వేతన కార్యదర్శి గండి జోగి నాయుడు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కలిసిన పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సందడి

ప్రజాశక్తి -నక్కపల్లి:ప్రతీ ఒక్కరి జీవితంలో గుర్తుండే తీపి జ్ఞాపకాలు చిన్నతనంలోనే ఉంటాయి. తాము ఆనాడు చదువుకునే రోజులు, చేసే అల్లరి, వారితో కలిసి ఆడిన ఆటలు ..అవన్నీ ఒక మధురమైన క్షణాలు. మళ్ళీ అవన్నీ గుర్తుకు తెచ్చుకుంటూ నక్కపల్లి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 1982-83 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు అదే పాఠశాల వేదికగా ఆదివారం వీరంతా కలుసుకున్నారు. అలనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ రోజంతా ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. ఒకరు నొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వీరంతా ఉద్యోగ, వ్యాపార, రాజకీయ రంగాల్లో స్థిరపడ్డారు. ఆదివారం వీరంతా కలిసి పోవడంతో ఆనందం వ్యక్తం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కేవీ సత్యనారాయణ, బొల్లం కోటేశ్వరరావు, డి రమణ, రామారావు, శ్రీనివాసరావు, వెంకటరమణ, సత్యానంద్, రెడ్డి త్రినాధరావు, జ్యోతి, భారతి, మల్లేశ్వరి పాల్గొన్నారు.

25న బొమ్మనవారి

బుట్టబొమ్మ నూతన స్టోర్ ప్రారంభం

మాట్లాడుతున్న నిర్వాహకులు

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ: వస్త్ర వ్యాపార రంగంలో గత నాలుగు దశాబ్దాలుగా తెలుగు రాష్ట్రాల ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటున్న బొమ్మన బ్రదర్స్ వారి నూతన స్టోర్ "బుట్ట బొమ్మ" ఈనెల 25న విశాఖపట్నంలోని మద్దిలపాలెం వద్ద ఉన్న ఇంటర్మీడియట్ బోర్డు కార్యాలయం ఎదురుగా ప్రారంభించడం జరుగుతుందని బొమ్మన సత్య రాజ్ కుమార్ తెలిపారు. ఆదివారం ఉదయం మద్దిలపాలెం లోని నూతన స్టోర్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తమ తండ్రుల కాలం నుంచి ఆనవాయితీగా వస్తున్న వస్త్ర వ్యాపారాన్ని తమ మూడవ తరం వారు కూడా కొనసాగించాలనే ఉద్దేశంతో బుట్ట బొమ్మ పేరుతో నూతన స్టోర్ ను తన కుమారుడు బొమ్మన మణి రాజ్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. విదేశాలలో విద్యను అభ్యసించినప్పటికీ కుటుంబ వ్యాపారాన్ని మరింత వృద్ధిలోకి తెచ్చేందుకు తన కుమారుడు ఈ శాఖ నిర్వాహణ బాధ్యతలు తీసుకున్నాడని అన్నారు. అనంతరం శాఖ నిర్వాహకుడు బొమ్మన మణి రాజ్ కుమార్ మాట్లాడుతూ, విశాఖలో ఇది నాలుగో శాఖ అని, తెలుగు రాష్ట్రాల్లో తమకు 15 కుపైగా శాఖలు ఉన్నాయని తెలిపారు. రాజమండ్రి కేంద్రంగా వ్యాపారాన్ని ప్రారంభించిన తాము అంచెలంచెలుగా ఎదిగి ఈ స్థాయికి వచ్చామని అన్నారు. తమ వద్ద భారతదేశంలోని అన్ని సంస్కృతులకు చెందిన చీరలు అందుబాటులో ఉన్నాయని సామాన్యులకు కూడా నాణ్యమైన చీరలను చేరువ చేసేందుకుగాను ఎనిమిది వందల ప్రారంభ ధర నుండి అందుబాటులో ఉంచామని తెలిపారు. చేనేత వస్త్ర పరిశ్రమను కూడా ప్రోత్సహించే విధంగా తమ వద్ద అన్ని రకాల చేనేత, పట్టు, ఫ్యాన్సీ, చీరలు లభిస్తాయన్నారు. ఈ మీడియా సమావేశంలో బొమ్మన సిల్క్స్ నిర్వాహకులు బొమ్మల యువరాజ్ కుమార్, బొమ్మన సునీత, బొమ్మన చంద్రిక తదితరులు పాల్గొన్నారు.

పతకాలతో నాగజ్యోతి

పవర్ లిఫ్టింగ్‌లో నాగజ్యోతి సత్తా

-బంగారు పతకాలు కైవశం

ప్రజాశక్తి-రోలుగుంట:వరల్డ్ పవర్ లిఫ్టింగ్ కాంగ్రెస్ తెలంగాణా ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్ లో ఫుల్ పవర్ లిఫ్టింగ్, డెడ్ లిఫ్ట్, బెంచ్ ప్రెస్ విభాగాలు జరిగాయి. ఈ పోటీల్లో రోలుగుంట జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయురాలు పీవీఎం.నాగజ్యోతి ఆంధ్రప్రదేశ్ తరపున పాల్గొని ఈ మూడు విభాగాల్లో బంగారు పతకాలు సాధించారు. ఈ పోటీలకు 200 మంది క్రీడాకారులు సుమారు ఎనిమిది రాష్ట్రాల నుంచి హాజరు అయ్యారు. మూడు బంగారు పతకాలు సాధించిన నాగజ్యోతిని పలువురు అభినందనలు తెలియజేశారు.

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న చైర్మన్

విశాఖలో
ఘనంగా స్టూడెంట్స్ ఫెస్ట్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ:'ది విశాఖపట్నం బ్రాంచ్ ఆఫ్ ది సదరన్ ఇండియా రీజినల్ కౌన్సిల్ (ఎస్ఐఆర్‌సి) ఆఫ్ ఐసీఏఐ' ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఉడిపాస్ సికాసా స్టూడెంట్స్ ఫెస్ట్ 2024' ఘనంగా నిర్వహించారు. అల్లూరి విజ్ఞాన్ భవన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నగరానికి చెందిన చార్టెర్డ్ అకౌంటెంట్లు అధిక సంఖ్యలో హాజరయ్యారు. బ్రాంచి చైర్మన్ సీఏ అనిర్బన్ పాల్‌తో పాటు సికాసా చైర్మన్ సీఏ పి.లోకేష్ తదితరులు విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ, భవిష్యత్తులో తీసుకోవాల్సిన నిర్ణయాలు, రాణించాల్సిన అంశాలపై ఉత్తేజపరిచారు. సీఏ పి.లోకేష్ మాట్లాడుతూ, ఈ కార్యక్రమ ముఖ్యోద్దేశ్యాన్ని వివరించారు. అపజయాలతోనే విజయాల్ని సాధించే విషయాన్ని తెలియజేశారు. నిరంతర సాధనతోనే అది సాధ్యమవుతుందన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతుల్ని అలరించాయి. డ్యాన్స్, పాటలు, డీజే తదితర ప్రదర్శనలు అలరించాయి. విజయాలు సాధించిన విద్యార్థుల మనోభావాలు ఈ ఫెస్ట్ ద్వారా ఇతరుల్లో స్ఫూర్తిని నింపాయి. సికాసా గవర్నెన్స్ హెడ్ సీఏ డి.ఉజ్వల చేపట్టిన స్కిట్ ఆకట్టుకుంది. మహిళలు, విద్యార్థినులపై జరుగుతున్న దాడులపై అందరిలోనూ అవగాహన కల్పించేలా ఈ ప్రదర్శన ఉందని అతిథులు ఆమెను కొనియాడారు. సికాసా మేనేజింగ్ కమిటీ సభ్యుల పర్యవేక్షణలో సీఏ అనిర్బన్ పాల్ (బ్రాంచి చైర్మన్), విద్యార్థి విభాగ చైర్మన్ సీఏ పి.లోకేష్, గవర్నెన్స్ హెడ్ సీఏ డి.ఉజ్వల, కోశాధికారి బి.డిరపుల్ స్నేహిత, ఎడిటర్ మెంబర్ జి.ఉజ్వల్, సభ్యులు కె.పుష్కర్, సంపత్, ఐషిక తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ కంపెనీలకు

విద్యుత్ రంగాన్ని కట్టబెట్టేందుకు బిజెపి కుట్ర

- 24న నిరసనలో పాల్గొనండి - సిఐటియు పిలుపు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్:కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని మొత్తం కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టాలని నిర్ణయించిందని, దీనిలో భాగంగా చండీఘర్ రాష్ట్ర డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్‌ను ప్రైవేట్ కార్పొరేట్ సంస్థ అయిన "ఎమినేంట్ ఎలక్ట్రిసిటీ లిమిటెడ్ కంపెనీకి" అమ్మడానికి ఈ నెల 4 న చండీఘర్ రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. చండీఘర్ పంజాబ్, హర్యానా రాష్ట్రాలకు రాజధానిగా ఉన్న కేంద్ర పాలిత ప్రాంతమని, లాభాలు గడించే చండీఘర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్‌ను ప్రైవేటు వారికి అప్ప చెప్పడాన్ని సిఐటియు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. చండీఘర్ విద్యుత్ కార్మికులు చేస్తున్న పోరాటానికి దేశవ్యాప్తంగా డిసెంబర్ 25న చలో చండీఘర్ కార్యక్రమం జరుగుతుందని, వారికి మద్దతుగా విశాఖలో మంగళవారం ఉదయం 10 గంటలకు ఎస్ఈ ఆఫీసు వద్ద నిరసన కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ కార్మికులతో పాటు ఇతర కార్మికులు కూడా పాల్గొని విద్యుత్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. చండీఘర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ అత్యధిక లాభాలను ఆర్జిస్తున్న సంస్థ అన్నారు.2019-2020 లో రూ.365 కోట్లు, 2020-2021 లో రూ. 225 కోట్లు లాభాలు గడించిందని తెలిపారు. దేశంలోనే అతి తక్కువ లైన్ లాస్ కేవలం 10 శాతం మాత్రమే అక్కడ ఉందన్నారు. మిగిలిన దేశమంతా లైన్ లాస్ సగటున 15 శాతం వరకు ఉంటుందన్నారు. అతి తక్కువ ధరకు కేవలం రూ.4.50 లకే విద్యుత్ అందిస్తుందన్నారు. ఇటువంటి సంస్థను ప్రైవేటు సంస్థకు కట్టడం అన్యాయం అన్నారు. మన రాష్ట్రంలో కూడా కేంద్ర ప్రభుత్వం కనుసన్నల్లోనే విద్యుత్తును ప్రైవేటీకరణ చేసేందుకు రంగం సిద్ధం చేస్తుందని, అందులో భాగంగానే ట్రూ అప్ చార్జీలు పేరుతో వినియోగదారులపై మోయలేని భారాలను మోపుతున్నారన్నారు. స్మార్ట్ మీటర్ల పేరుతో నిలువు దోపిడీకి పూనుకున్నారని విమర్శించారు. తక్షణమే విద్యుత్ ప్రైవేటీకరణ చర్యలను రాష్ట్ర ప్రభుత్వం విరమించాలని, స్మార్ట్ మీటర్ల రద్దు చేయాలని, ప్రజల మీద భారాలు వేసే చర్యలు ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

విరాళం ఇస్తున్న దాతలు

ఆలయానికి రూ.15 వేల విరాళం

ప్రజాశక్తి- మాడుగుల: మండలంలోని మండలంలోని ఎం కోడూరు మోదకొండమ్మ ఆలయ అభివృద్ధికి కీర్తిశేషులు రేణం. త్రిమూర్తులు, రమణమ్మ దంపతుల కుమారుడు శేషగిరి లక్ష్మి కుమారులు మోక్షత్ పవిత్రులు రూ. 15 వేలు విరాళాన్ని ఆలయ కమిటీ చైర్మన్ సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావుకు ఆదివారం ఆలయం వద్ద అందజేశారు.ఈ నగదును ఆలయ అభివృద్ధికి ఖర్చు చేయాలని దాతలు కోరారు. ఈ కార్యక్రమంలో పడాల అప్పలనాయుడు, జల్లి హరిప్రసాద్, సిరా అప్పలనాయుడు, లింగంపల్లి సతీష్, జగదీష్ పాల్గొన్నారు.

వాలంటీర్లను కొనసాగించాలి

ప్రజాశక్తి -అనంతగిరి: గ్రామ వాలంటీర్లకు రెగ్యులర్‌తో పాటు 10 వేలు వేతనాలు చెల్లిస్తామని ఎన్‌డిఏ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని గ్రామ వాలంటీర్లు ఈ నెల 26 నుండి 28 వరకు చేపట్టే ఆందోళనకు సిఐటియు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు తెలిపారు. ఆదివారం స్థానిక గిరిజన సంఘం కార్యాలయంలో పి. మంజుల అధ్యక్షతన సిఐటియు మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 6 నెలలు పూర్తి అయిందని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో అలసత్వం వహిస్తుందని తెలిపారు. ఇక పోరాటానికి సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే 10 వేల రూపాయలు గౌరవ వేతనం పెంచుతామని చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారని, ఇప్పుడు కూటమి నాయకులు వాలంటీర్లపై నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. ఇందుకు నిరసనగా వాలంటీర్లు ఈ నెల 26,27,28 తేదీల్లో మండల కేంద్రంలో తల పెట్టిన రిలే నిరాహార దీక్షలకు సిఐటియు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కిల్లో .మోస్య పాల్గొన్నారు.